
జన రాజకీయం కోసం ...


₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 6 సంచిక - 19 పక్షపత్రిక అక్టోబర్ 1-15, 2015



## రైతుల్ని నాశనం చేస్తున్న చీడపురుగులు ప్రభుత్వాల విధానాలే


లోక్‌సత్తా పార్టీ
చౌదరి, రెడ్డి, నాయుడు,వర్మ,
యాదవ్, గౌడ్ లాంటి కుల పదాలని
పేరు చివర నుంచి తొలగించుకోండి...
యువతకు జయప్రకాష్ నారాయణ్ పిలుపు

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక అక్టోబర్ 1-15, 2015

సంపుటి - 6 సంచిక - 19

## లోపలి పేజీల్లో...

రైతుల్ని నాశనం చేస్తున్న చీడపురుగులు ప్రభుత్వాల విధానాలే.................................................... 5

దేశానికి ఆహార భద్రత కల్పించిన రైతులకు ఆదాయ భద్రత వద్దా..?................................................ 11

వ్యవసాయ సంక్షోభంపై అదేం చర్చ రాజ్‌దీప్‌జీ............ 13

రైతుల మార్కెట్‌యార్డుల్లో చెలరేగిపోతున్న నేతలు... 15

వ్యవసాయేతర రంగాలలో ఉద్యోగుల్ని సృష్టించాలి..... 16

జిందాల్ భూ సేకరణలో అక్రమాలపై లోక్‌సత్తా............. 17

ఆకాంక్షలు తప్ప ఉద్యోగాలు కల్పించే విధానాలు ఏవీ.. 19

ఎన్నికలు @ లింకన్.................................................. 20

హైకోర్టు విభజన కన్నా ప్రజలకు స్థానిక కోర్టుల ............ 21

మార్పు నియోజకవర్గాల్ని తయారుచేసుకోవాలి......... 22

రాజకీయ పార్టీలు సమాచార హక్కు పరిధిలోకి ......... 23

లోక్‌పాల్ చట్టాన్ని అవినీతిపై పోరుని నీరుగార్చే.......... 24

లోక్‌సత్తా ఉద్యమం, పార్టీ........................................... 25

హైదరాబాద్ అభివృద్ధికి అవరోధంగా మారిన ............ 31

మాంసంపై నిషేధం ప్రజల స్వేచ్ఛపై దాడి : జేపీ............. 33

లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు........................................ 33

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు


### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

**వచ్చి పోయే లాంతర్ల ప్రభావాలకు లోనుకాకుండా దూరనక్షత్ర కాంతులతో మార్గాన్ని ఏర్పరుస్తూ, నివారించదగ్గ బాధలను తొలగించేందుకు, వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను కల్పించేందుకు దీర్ఘకాలిక పోరాటం చేస్తున్న లోక్‌సత్తా కృషిలో భాగస్వాములైన నేతలు, కార్యకర్తలు, అభిమానులకు లోక్‌సత్తా పార్టీ 9వ వార్షికోత్సవ ఆత్మీయ శుభాకాంక్షలు**

మీ










# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

‘లోక్‌సత్తా టైమ్స్’ పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి ‘లోక్‌సత్తా టైమ్స్’ పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును “లోక్‌సత్తా టైమ్స్” ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# రైతుల్ని నాశనం చేస్తున్న చీడపురుగులు ప్రభుత్వాల విధానాలే



- డా॥ జయప్రకాష్ నారాయణ్

మనకు తిండి, ఓట్లు, పరిశ్రమలకు ముడిసరకు అందించే యంత్రాల్లా రైతులు ఉండాలంటే, వారు చావకుండా బతకాలి అనే ధోరణి ప్రభుత్వాలలో పాతుకుపోబట్టే ఆత్మహత్యలు వంటి ఘటనలు జరిగినప్పుడు మాత్రమే వ్యవసాయ సంక్షోభంపై కొంతైనా స్పందిస్తున్నాయి. అందుకే, తాత్కాలిక ఉపశమనాలతో ఆత్మహత్యలను ఆపటం వరకే ఆ చర్చను పరిమితం చేస్తున్నాయి. రైతులకు మెరుగైన ఆదాయం, వారి బిడ్డలకు విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలతో ఉజ్వల భవిష్యత్తు వంటి వాటి గురించి ప్రస్తావన, ఆత్మహత్య ఆలోచనేరాని రీతిలో ఆ దిశగా వ్యవస్థీకృత ఏర్పాట్లు వంటి నిజమైన పరిష్కారాల్ని మాత్రం చర్చల్లోకి రానివ్వటం లేదు. కేంద్రంలో, రాష్ట్రాల్లో వరస ప్రభుత్వాల విధానాల వల్లే ఈవేళ రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. రుణమాఫీ వంటి అసంబద్ధ విధానాన్ని అమలు చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సంక్షోభం ఇంకా తీవ్రరూపం దాలుస్తోంది. ప్రకృతి శాపం వల్ల కాదు, కేవలం పాలకుల పాపం వల్లే రైతులకు ఒక విషవలయంలా ఇలా కష్టాలు దాపురిస్తున్నాయి.

దేశజనాభాలో అత్యధికంగా ఉన్న వ్యవసాయాధారిత ప్రజలు ఆత్మహత్యలు చేసుకోకుండా జీవచ్ఛవాల్లా బతికితే చాలు అనే విధానాల్ని, రాజకీయాన్ని మార్చితే తప్ప రైతుల సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావు. రైతులకు తక్షణ భరోసా ఇస్తూనే, వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు ఏం విధానాలు, ఏం చర్యలు కావాలి? – ఇదీ ఇప్పుడు తెలుగు రాష్ట్రాలకు, దేశానికి కావలసిన అసలైన చర్చ.




“లేదు సార్! ఇక్కడ మా సమస్య వరదలు, కరువులు, ప్రకృతి వైపరీత్యాలు కాదు. మమ్మల్ని కుంగదీస్తున్నది చెడ్డప్రభుత్వం; దుష్పరిపాలన!”

భారతదేశ సామాజిక, ఆర్థిక వ్యవస్థల్ని దెబ్బతీసేందుకు కుట్ర పన్నారా అన్నట్టు మన పాలకులు, రాజకీయ వ్యవస్థ నాశనం చేసిన రెండు రంగాలు – విద్య, వ్యవసాయం! దేశ మానవ వనరుల అభివృద్ధికి విద్య అత్యంత కీలకమైనా, ప్రజల్లో చదువు పట్ల మమకారం, గౌరవం ఉండి అందుకోసం జేబులో నుంచి కూడా ఖర్చు పెట్టే చొరవ ఉన్నా, ప్రజల్లో ఎక్కువమంది వ్యవసాయం మీదే ఆధారపడి ఉన్నా కూడా ఏమాత్రం ముందుచూపు, అవగాహన లేకుండా విద్య, వ్యవసాయ రంగాల్ని అధ్వాన్నం చేసే విధానాల్ని అమలు చేశారు. రైతుకి ఆదాయం అందించేరీతిలో వ్యవసాయ విధానాలను తయారుచేయకుండా, రైతును ముడిసరకులు, వంటసరకులు తయారుచేసే యంత్రంగా చూడటం, రైతులకు రేటు వస్తే అది వినియోగదారులకు నష్టం అనే రీతిలో పాలకులు వ్యవహరించటం వల్ల దేశజనాభాలో

మెజారిటీగా ఉన్న జనాభా తలసరి ఆదాయం గణనీయంగా పడిపోయింది. విద్య కూడా లేకపోవటం వల్ల వ్యవసాయేతర రంగాలలో పెద్దఎత్తున అభివృద్ధి చెందే అవకాశాన్ని కూడా దేశం కోల్పోయింది. లాభసాటికాని వ్యవసాయం నుంచి వేరే రంగాలకు వెళ్లేందుకు మెజారిటీ జనాభాకు తగిన చదువు, నైపుణ్యాలు కొరవడటంతో గ్రామాలలో అభివృద్ధి ఎక్కడివేసిన గొంగళి అక్కడేలాగా తయారైంది. గ్రామాలకు-పట్టణాలకు, వ్యవసాయానికి-పరిశ్రమలకి మధ్య అంతరం విపరీతంగా పెరిగిపోయింది. దేశంలో ఎక్కువమంది వ్యవసాయం మీదే ఆధారపడినవారు కావటంతో అధికసంఖ్యాక పేదలు, అల్పసంఖ్యాక సంపన్నుల వ్యవస్థ తయారైంది. భారతదేశంలో వార్షిక తలసరి ఆదాయం రూ. 90,000 ఉన్నా, వ్యవసాయంలో ఉన్నందున అధిక సంఖ్యాక ప్రజల తలసరి ఆదాయం రూ. 20,000-25,000 మాత్రమే. ఈ డబ్బుతోనే వారు పిల్లల్ని చదివించుకోవాలి, కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. చదువుల కోసం, ఆరోగ్యం కోసం అప్పులపాలవుతూ పేదరికంలోకి జారిపోతున్న వారిలో ఎక్కువశాతం వ్యవసాయం మీద ఆధారపడినవారే. ఇది పూర్తిగా పాలకుల పాపం తప్ప ఏ దేవుడి శాపమూ కాదు.

తొలి రోజుల నుంచి లైసెన్స్‌రాజ్ చట్రంలోనైనా పారిశ్రామిక రంగాన్ని పట్టించుకున్నారుగానీ, వ్యవసాయాన్ని గురించి అంత లోతుగా ఆలోచించలేదు. వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా మలిచే ప్రయత్నం చేయలేదు. తొలినాళ్లలోని ఆ విధానపరమైన వైఫల్యం, కాలం గడుస్తున్నకొద్దీ దేశానికి శాపంగా మారింది. ప్రకృతి ఆటుపోట్లను తట్టుకుని ఆరుగాలం కష్టపడి పంట పండించినా, ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా రైతుకు లాభసాటి ధర రాని దుస్థితి నెలకొంది. చివరికి 1991లో ఎంతోకొంత మొదలైన ఆర్థికసంస్కరణలతో పారిశ్రామిక ఉత్పత్తులకు లాభాలు రావటం మొదలైందిగానీ, ఆ సంస్కరణలలో కూడా వ్యవసాయానికి మోక్షం కలగలేదు. ఆర్థికసంస్కరణలు కేవలం పారిశ్రామికరంగానికే పరిమితమయ్యాయి తప్ప వ్యవసాయాన్ని తాకనైనా లేదు. పారిశ్రామికవేత్తలాగా తన ఉత్పత్తిని ప్రపంచంలో ఎక్కడ ధర ఉంటే అక్కడ అమ్ముకోనీయకుండా రైతును అణచివేస్తూ పైకి మాత్రం రైతే రాజు, రైతే దిక్కు అంటూ మొసలికన్నీళ్లు కారుస్తూ ఓట్లు కొల్లగొట్టే రాజకీయం సాగిస్తున్నారు. దేశ అవసరాలకు మించి గిడ్డంగులలో రికార్డుస్థాయిలో ఆహారధాన్యాల నిల్వలు పేరుకుపోయి కుళ్లిపోతున్నా సరే, మంచి ధర ఉన్న ఇతర ప్రాంతాలలో రైతులు పంటల్ని అమ్ముకోకుండా ఆంక్షలు విధించారు, ఎగుమతుల్ని నిషేధించారు. రైతు పండించిన పంటను అమానుషంగా సగానికి సగం ధరకు తెగ్గొట్టి కొనుగోలు చేసి ఎంగిలి మెతుకుల్లా కాసిని రాయితీల్ని విదులుస్తూ పంట మాకు-పరిగ నీకు అన్నట్టు రైతు వెన్నువిరిచేస్తున్నారు. తాత్కాలిక ఉపశమనమైన ఉపాధి హామీ పథకం కూలీలుగా మార్చేస్తున్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో వరస ప్రభుత్వాలు తమ అసంబద్ధ, క్రూర విధానాలతో పంట దిగుబడుల ధరల్ని కృత్రిమంగా తగ్గించి రైతులకు కలిగిస్తున్న నష్టంతో పోలిస్తే, వరాలుగా చాటుకుంటూ ఆ పాలకులు రైతులకి ఇస్తున్న రాయితీల్ని వాస్తవ మొత్తంగా



చూసినా కూడా చాలా తక్కువే. ఈవేళ మనదేశజనాభాలో సగానికిపైగా వ్యవసాయం మీద ఆధారపడి ఉంటే దేశస్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయం వాటా కేవలం 13.9శాతం. అంటే దేశ జీడీపీ ఏటా రూ. 1కోటి కోట్లు ఉంటే, వ్యవసాయరంగం వాటా కేవలం 14-15 లక్షల కోట్లు. రైతు వార్షిక తలసరి ఆదాయాన్ని రూ. 20,000-25,000 నుంచి కనీసం రూ. 1లక్షకైనా పెంచకుండా అభివృద్ధి గురించి మాట్లాడటం అర్థరహితమవుతుంది. రైతులకి ఆదాయాన్ని పెంచకుండా రైతులు తమ పంట ఉత్పత్తుల్ని డిమాండ్ ఉన్న చోట అమ్ముకుని ఆదాయం పెంచుకునే వీలులేకుండా లైసెన్స్‌రాజ్ మార్కెట్ విధానాలతో వారిని అణగదొక్కుతూ దేశం కోసం త్యాగం చేయాలన్నట్టు మాట్లాడటం అమానుషమవుతుంది. సొంత వనరులు, ఆదాయం ఉన్నవారిని దేశం కోసం కొంత త్యాగం చేయమనటంలో అర్థం ఉందిగానీ, పేదరికంలోనే మగ్గుతున్నవారిని మీ ఆదాయాల్ని దేశం కోసం ఇమ్మని అడగటం ఎంతమాత్రం తగదు.

రైతులంటే రైతు కూలీలు, కౌలుదారులు కూడా. వీరి ఆదాయాన్ని పెంచాలంటే పెద్దఎత్తున ఈ రంగానికి రాయితీలు ఇవ్వాల్సుంటుంది. అయితే ఐరోపాలో, అమెరికాలోలాగా ఎక్కువ జనాభా వ్యవసాయేతర రంగాలలో ఉండి కొద్దిమందే వ్యవసాయరంగంలో ఉంటే మిగతావారు రైతులకు భారీ సబ్సిడీలను ఇచ్చినా పెద్ద భారం పడదు. కానీ దేశజనాభాలో సగానికిపైగా ఉండే రంగానికి మిగిలినవారు సబ్సిడీ ఇవ్వటం అంటే చాలా సందర్భాలలో ఆచరణ సాధ్యం కాదు. అందుకే రైతులకు మౌలికవసతుల కల్పన దగ్గర్నుంచి మార్కెట్‌లో రేటు వచ్చేంతవరకూ ఆదాయాన్ని పెంచేరీతిలో సబ్సిడీలను ఇవ్వటానికి మనదేశంలో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ఆ ఇచ్చేది రుణమాఫీల రూపంలో ఇస్తే రైతులకీ లాభం ఉండదు, మిగతావారికీ భారం అవుతుంది. తాత్కాలిక తాయిలాలు కాకుండా దీర్ఘకాలంలో రైతుల ఆదాయాన్ని, జీవన ప్రమాణాన్ని పెంచటం ప్రభుత్వ విధానాల లక్ష్యం కావాలి.


వ్యవసాయరంగ సంక్షోభాన్ని పరిష్కరించుకోవాల్సిన రైతుల్లో సరైన అవగాహన లేకపోవటం, కులాలు, ప్రాంతాలు, పార్టీలవారీగా వారు చీలిపోవటం, మిగతా సమాజం వారిని పట్టించుకోకపోవటం, ఈ సంక్షోభాన్ని ఇలాగే కొనసాగిస్తూ రైతుల ఓట్లు దండుకునేందుకు పార్టీలు ఇష్టమొచ్చినట్టు రుణమాఫీలు వంటి వృధా హామీల్ని ఇవ్వటం వల్ల మొత్తం సమాజానికి ఎంత సంక్షోభం ఏర్పడుతుందో తాజా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వైఫల్యాల్ని చూస్తే అర్థమవుతుంది. రుణమాఫీల వల్ల రైతుల సంక్షోభం పరిష్కారం కాకపోగా దీర్ఘకాలంలో రైతులు సహా సమాజమంతా మూల్యం చెల్లించాల్సి ఉంటుందని గతంలో చేసిన రుణమాఫీలు రుజువు చేస్తున్నాయని లోక్‌సత్తా ఎంత చెప్పినా పార్టీలు వినిపించుకోలేదు, సమాజం పట్టించుకోలేదు. ఆర్థికవనరులకు తోడు డబ్బులు ముద్రించే అధికారం ఉంటుంది కాబట్టి కేంద్రప్రభుత్వం రుణమాఫీలు వంటివి ఏదోకస్థాయిలో చేయగలదుగానీ రాష్ట్ర ప్రభుత్వాలకు అది గుదిబండ అవుతుందని, అందునా కొత్తగా ఏర్పడిన రాష్ట్రాలు దీని వల్ల పురిట్లోనే దెబ్బతింటాయని హెచ్చరించినా ఎవరూ వినిపించుకోలేదు. ఇలాంటి రుణమాఫీల వల్ల రైతులకు నిజమైన లాభం చేకూరకపోగా ఇతర రంగాలు ఆ నష్టాన్ని భరించాల్సి ఉంటుంది. రైతులకు కావలసింది ఆదాయం పెరగటం, తలెత్తుకుని బతకటం, తమ బిడ్డలకు మంచి భవిష్యత్తుని అందించటం. దానికి కావలసింది రైతులకు మౌలిక వసతులు, తేలిగ్గా పెట్టుబడి రుణాలు, నాణ్యమైన విద్యుత్, ఎరువులు, యాంత్రీకరణ, సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ భూసార పంట సలహాలు, వర్షాధారం మీద మితిమీరి ఆధారపడకుండా తగిన ఏర్పాట్లు, పండించిన పంటను ప్రపంచంలో ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ అమ్ముకునే మార్కెట్ అవకాశాలు, ధర రాకపోతే కుళ్లిపోయే పంటలు దెబ్బతినకుండా నిల్వ, ప్రాసెసింగ్ ఏర్పాట్లు, దళారీ వ్యవస్థను నియంత్రించి రిటైల్ చైన్‌లను పెద్దఎత్తున ఏర్పాటుచేయటం. ఇవి వదిలేసి రైతులకు రుణమాఫీలంటూ ప్రలోభాలకు పాల్పడితే తాత్కాలికంగా ఉపశమనం కలగొచ్చుగానీ రైతుల జీవితాలు ఎలా బాగుపడతాయి? రైతులు వ్యవసాయేతర రంగాలలో వారిలా ఉన్నతంగా, అధునాతనంగా ఎలా జీవించగలుగుతారు? సమాజానికి ఆహారాన్ని, సరకుల్ని, రాబోయే కాలంలో ఇంధన ఉత్పత్తుల్ని కూడా అందించే రైతు చతికిలపడ్డాక ఇక మిగతా సమాజం పరిస్థితి ఏమిటి? దేశం వ్యవసాయోత్పత్తుల్లో స్వయంసమృద్ధిని, లాభాల్ని, విదేశీమారక ద్రవ్యాన్ని సాధించటంతోపాటు వ్యవసాయేతర రంగాలలో కూడా ఆదాయాన్ని పొందే నైపుణ్యాన్ని రైతు కుటుంబాలకు అందేలా చేయకపోతే ఇక ఈ సమాజంలో తీవ్ర ఆర్థిక, సామాజిక, రాజకీయ సంక్షోభం తప్పదు.

2014లో ఎన్నో ఆశలతో ఎన్నుకున్న ఎన్డీయే ప్రభుత్వం కూడా మొదటి తప్పు వ్యవసాయరంగం విషయంలోనే చేసింది. కొరత ఏర్పడిందని టమాటా, ఉల్లగడ్డల నిల్వని, ఎగుమతుల్ని నియంత్రిస్తూ ఎప్పుడో రెండో ప్రపంచయుద్ధకాలంలో ఉపయోగించిన నిత్యావసర సరకుల చట్టాన్ని అమలు చేసింది. ఇది రైతుల్ని, ప్రజల్ని కూడా ఏకకాలంలో దగాచేయటమే. రైతులకు పెట్టిన ఖర్చు వచ్చేలా గిట్టుబాటు ధరలు, ఇన్సూరెన్స్ చట్టం అంటూ చిన్నచిన్న అంశాలను ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారుతప్ప వారు పండించిన పంటలకు డిమాండ్ ఉన్నా అందుకు తగ్గ ఆదాయాన్ని అందించే ఏర్పాటు చేద్దామన్న ఆలోచన పాలకుల్లో కనిపించటం లేదు. మన వ్యవసాయోత్పత్తుల్లో ఏటా సుమారు 330 మిలియన్ టన్నుల వ్యర్థాలు ఉంటాయి. అందులో 150 మిలియన్ టన్నుల వరకూ పూర్తిగా వృధా అయి వాతావరణంలో 30శాతం కార్బన్‌డైఆక్సైడ్ కాలుష్యానికి కారణమవుతున్నాయి. అయినా ఈ వ్యవసాయ వ్యర్థపదార్థాలని సద్వినియోగం చేసి అటు పారిశ్రామిక, ఉపాధి రంగాల్ని, ఇటు రైతుల జీవితాల్ని మెరుగు పరుద్దామన్న ఆలోచనే ప్రభుత్వంలో కనిపించటం లేదు. అటు ప్రభుత్వం, ఇటు ప్రతిపక్షంలో ఉన్న పార్టీల మాటలు రైతులకోసమే అన్నట్టు ఉంటున్నాయి, కానీ వారి విధానాలు దాదాపు రైతు వ్యతిరేకమైనవి, రైతుని అణగదొక్కుతున్నవి.

తెలుగునాట పాల ఉత్పత్తి ద్వారా రైతులకు ఆదాయాన్ని పెంచేందుకు పరస్పర సహాయ సహకార చట్టాన్ని (మ్యాక్స్) చట్టాన్ని తీసుకొస్తే, దాన్ని కూడా నీరుగార్చేందుకు రాత్రికి రాత్రి జీవోల ద్వారా ప్రయత్నించారు. తమ సొంత జిల్లాలలో సర్కారీ పాల డెయిరీలను మూతవేయించి రైతుల ఆదాయాన్ని దారుణంగా దెబ్బతీసిన నేతలు రైతుబాంధవులమని చాటుకుంటున్నారు. కేవలం లోక్‌సత్తా చేసిన కృషి వల్లే, సుప్రీంకోర్టు దాకా చేసిన పోరాటం వల్లే రైతులకు అండగా ఉన్న సహకార వ్యవస్థకు ఇంకా స్వేచ్ఛ మిగిలివుందంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. దీనికోసం నేను జాతీయ సలహామండలిలో ఉన్నప్పుడు ఆ అవకాశాన్ని వినియోగించుకుని 97వ రాజ్యాంగ సవరణను తీసుకురాగలిగాను. దానివల్ల పౌరుల స్వేచ్ఛకు రాజ్యాంగం హామీనిచ్చిన 19 (1) ఆర్టికల్‌లోని 19 (1-సి) అధికరణం ద్వారా పౌరులకు సంఘాలుగా, ట్రేడ్‌యూనియన్లుగానే కాకుండా, సహకార సంస్థలుగా కూడా ఏర్పడే హక్కు ఉండేలా చేయగలిగాం. పరపతి స్థాయి నుంచి రైతుల ప్రయోజనాలను శాశ్వత స్థాయిలో పరిరక్షించేలా సహకార వ్యవస్థను నిర్మించేందుకు లోక్‌సత్తా తన కృషిని కొనసాగిస్తోంది.

2009లో అసెంబ్లీలో లోక్‌సత్తా పార్టీ ప్రాతినిధ్యం లేనంతవరకూ, అన్ని పార్టీలూ కూరగాయలు, ఉల్లిపాయల ధరలు పెరగగానే వాటితో దండలు వేసుకుని అసెంబ్లీకి వచ్చి ఆందోళనలు చేసేవి. ఒక వ్యవసాయోత్పత్తికి కాస్త రేటు పెరగగానే వినియోగదారుడి పేరుతో ఆందోళనలు చేసే పార్టీలు రైతులకు ఆదాయం పడిపోయి టమాటా కిలో 50పైసలో, పావలానో అమ్మినప్పుడు ఎందుకు మాట్లాడటం లేదు అని లోక్‌సత్తా ప్రశ్న లేవనెత్తింది. రైతులు పండించిన పంటను అమ్ముకోకుండా పెట్టిన చట్టవిరుద్ధ ఆంక్షల్ని ఎత్తివేయాలంటూ లోక్‌సత్తా 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పొరుగురాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలలోకి బస్తాల్లో ధాన్యాన్ని తీసుకెళ్లి అమ్మాక, దమ్ముంటే అరెస్టు చేయండని సవాలు చేసినా అదుపులోకి తీసుకునే సాహసాన్ని ప్రభుత్వం చేయలేకపోయాక, రైతులలో, వ్యాపారుల్లో కొంత ధైర్యం వచ్చింది. దాంతో ధాన్యం రేట్లు పక్కరాష్ట్రాలలో రేట్లకనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా పెరిగాయి. దీనివల్ల తెలుగునాట రైతులకు ఒక్క పంటకి, ఒక్క సీజన్‌లో, ఒక్క వెరైటీ ధాన్యానికి రూ.3600 కోట్ల మేర లబ్ధి చేకూరింది. మార్కెట్ ఆంక్షల పేరుతో అణగదొక్కటం వల్ల రైతులు ఎంత నష్టపోతున్నారో లోక్‌సత్తా రాష్ట్ర ప్రజలందరికీ చూపించటంతోపాటు సవివరంగా సభ ముందుంచింది. 'ఇప్పుడు కూడా కూరగాయలు మెడలో వేసుకుని ధరలు పెరిగాయని ఆందోళనలు చేస్తే రైతులకు ఇప్పటిదాకా మీరు చేసిన అన్యాయాన్ని వివరిస్తూ పెద్దఎత్తున ప్రచారం చేస్తా, ఇక మీరు గ్రామాలలో తిరిగే పరిస్థితి ఉండదు' అని నిర్మొహమాటంగా అన్ని పార్టీలకూ చెప్పా. దాంతో వెనక్కి తగ్గారు. రైతుల రేటు గురించిన చర్చ లేకుండా ధరలు పెరిగాయన్న రాజకీయ ఆందోళనలు లేకపోవటం మొదటిసారిగా ఆ అసెంబ్లీలోనే జరిగింది. రైతుకు ఆదాయం రాకుండా వినియోగదారునికి ధరలు పెరిగే పరిస్థితిని మార్చి రైతుకు ఆదాయం, వినియోగదారుడికి తక్కువ రేటుకే ఉత్పత్తులు లభించటం మీద దృష్టి పెట్టేలా వ్యవసాయం మీద చర్చను లోక్‌సత్తా మలుపుతిప్పింది. రైతుకి, వినియోగదారునికి నష్టం చేకూరుస్తున్న దళారీ వ్యవస్థను తొలగించి ఇద్దరి మధ్యా నేరుగా లావాదేవీలు జరిగేలా రిటైల్ అంగడుల వ్యవస్థని పెద్దఎత్తున ప్రోత్సహించాలని, ఇందుకోసం స్వదేశీ, విదేశీ తేడా లేకుండా పెద్దఎత్తున ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించాలి అని తక్షణ రాజకీయ ప్రయోజనాలను కూడా పక్కనబెట్టి లోక్‌సత్తా కృషి చేసింది.

కేవలం లోక్‌సత్తా చేసిన ప్రయత్నం వల్లే 2012లో




## పెరగనున్న పప్పు ధాన్యాల కొరత

**డిమాండ్ తట్టుకోవడానికి దిగుమతులు తప్పవు : అసోచాం**


భారత్... తీవ్రస్థాయిలో పప్పు ధాన్యాల కొరతను ఎదుర్కొంటోంది. ఫలితంగా పండగల సీజన్ ముందు వీటి ధరలు 10-15 శాతం మేర పెరిగే అవకాశం ఉందని 'అసోచాం' అధ్యయనం చెబుతోంది.

యూపీయే ప్రభుత్వం ఆహారధాన్యాల ఎగుమతుల్ని తిరిగి ప్రారంభించింది. ఫలితంగా ఈవేళ భారత్ ప్రపంచంలోనే అత్యధికంగా సుమారు 2 కోట్ల టన్నుల ఆహారధాన్యాల్ని ఎగుమతి చేయగలుగుతోంది. వ్యవసాయ ఎగుమతుల నుంచి సుమారు 39 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జిస్తోంది. మనం పూర్తిస్థాయిలో ఈ సమగ్ర స్వేచ్ఛావాణిజ్య విధానాన్ని వ్యవసాయ విధానాన్ని అనుసరిస్తే వంద బిలియన్ డాలర్ల విదేశీ ద్రవ్యాన్ని ఆర్జించగలిగే శక్తి ఉంది. మిగతా ఏ దేశమూ చేసుకోనంత స్థాయిలో మనం వంటనూనెల్ని, పప్పు దినుసుల్ని దిగుమతి చేసుకుంటున్నా, ఇప్పటికీ వాటి ఉత్పత్తిలో స్వయంపోషకం గురించి సరైన ప్రయత్నం చేయటం లేదు సరికదా, వాటి దిగుమతుల మీద కొద్దిపాటి పన్ను విధించి మన రైతులను ప్రోత్సహిద్దామన్న ఆలోచన కూడా చేయటం లేదు. వంటనూనెలు, పప్పు దినుసులు వంటి వాటి మీద 20శాతం దిగుమతి సుంకాన్ని విధించి ఆ డబ్బుని మన రైతులకే ఇస్తే, విదేశీ మారక ద్రవ్యంతోపాటు రైతులకూ ఆదాయం చేకూరుతుంది. దేశం ఈ ఉత్పత్తుల్లో స్వయంపోషకమవుతుంది. ఉపాధి హామీ వంటి పథకాలను ఓట్ల కోసం ఉపయోగించుకుంటూ వేలకోట్ల రూపాయల్ని పందేరం చేయకుండా జలవనరులు, ఉత్పాదకత పెంచేందుకు ఉపయోగిస్తే రైతులకు, దేశానికి ఆదాయం పెరుగుతుంది.

అలాగే రైతుకు లాభం రావటంతోపాటు భారీ జనాభా ఉన్న దేశంలో అందరికీ తక్కువ ధరకి ఆహారం అందుబాటులోకి రావాలంటే జన్యుమార్పిడి వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించకతప్పదు. సాంకేతిక పరిజ్ఞానం లేకపోతే మున్ముందు వ్యవసాయోత్పతుల ధరలు చాలామందికి అందుబాటులో ఉండవు. పంట వ్యయాన్ని గణనీయంగా తగ్గించి ఉత్పత్తిని పెంచి రైతుకు, వినియోగదారునికీ మేలుచేసే జన్యుమార్పిడి (జి.ఎం) సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై కూడా కొందరు మిడిమిడిజ్ఞానంతో, ముందుచూపు లేకుండా అభ్యంతరాలు లేవనెత్తి దేశ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారు.

స్వతంత్రం వచ్చినప్పుడు మనదేశ ఆహారోత్పత్తి సామర్థ్యం 50 మిలియన్ టన్నులు ఉంటే ఇప్పుడది 250 మిలియన్ టన్నుల్ని చేరుతోంది. సాంకేతిక పరిజ్ఞానం లేకుండా ఇన్ని కోట్ల మంది ప్రజలకు ఆహారాన్ని, పోషకాల్ని అందించటం అసాధ్యమని శాస్త్రవేత్తలు, మన అనుభవాలు రుజువు చేస్తున్నాయి. ప్రపంచంలో కోట్లాది ప్రజలకు ప్రాణదాతగా పేరొందిన శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్ సాంకేతిక విప్లవంతోనే ఆ పనిచేయగలిగారు. తరతరాలుగా మన వ్యవసాయంలో ఉన్న అంట్లు కట్టటం, హైబ్రిడ్ తయారీ వంటి వాటికి కొనసాగింపే జన్యుమార్పిడి పంటలు. పొరుగున్న ఉన్న చైనా సహా ప్రపంచంలో వ్యవసాయోత్పత్తుల్లో అగ్రస్థానంలో ఉన్న దేశాలు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాయి. రాచరిక, పెత్తందారీ సంస్కృతి ఉచ్ఛస్థితిలో కొనసాగుతున్న రోజుల్లో కొద్దిమందికే అవకాశాలు అందుబాటులో ఉండి, వనరులు పుష్కలంగా ఉన్నట్టు, ఏ విధమైన సాంకేతిక పరిజ్ఞానం లేకుండానే అన్నీ సమకూరినట్టు కనిపిస్తుంది. కానీ ప్రజాస్వామీకరణ జరుగుతూ సమాజంలో చిట్టచివరి పౌరునికి కూడా అన్ని వసతులూ, మంచి ఆహారం అందాలంటే కాలుష్యం, ఇతర దుష్పరిణామాల నియంత్రణకు తగిన చర్యలను చేపడుతూ ఖచ్చితంగా సాంకేతిక పరిజ్ఞానం వాడాల్సిందే. భారత్ వంటి పెద్దదేశం సాంకేతిక పరిజ్ఞానాన్ని వదులుకోవటమంటే ఊహించనంత భారీ నష్టాన్ని చూడాల్సి వస్తుంది. ఒకప్పుడు జన్యుమార్పిడి సాంకేతిక పరిజ్ఞానం చౌకగా మన వద్దకు వచ్చినప్పుడు మన పాలకులు, సమాజం మూర్ఖంగా తోసిపుచ్చాయి. ఇతర దేశాలు అందిపుచ్చుకుని దూసుకెళ్తున్నాయి. జి.ఎం సాంకేతిక పరిజ్ఞానం వల్ల మానవాళిపై ఎటువంటి అనారోగ్యం వంటి దుష్పరిణామాలు తలెత్తవని శాస్త్రవేత్తలు సాధికారికంగా ప్రకటిస్తున్నా, ఇంకా అజ్ఞానంతో, భయంతో, బాధ్యతారాహిత్యంతో అడ్డుకుంటున్నారు. రైతుల ఆదాయాన్ని, దేశాభివృద్ధిని అడ్డుకుంటున్నారు. వివిధ జి.ఎం పంటలకు అనుమతిపై నిపుణులైన శాస్త్రవేత్తలతో కూడా రెగ్యులేటరీ సంస్థలు నిర్ణయిస్తాయి. వ్యవసాయరంగ ఆధునీకరణని మిడిమిడి జ్ఞానంతో అడ్డుకునే ప్రమాదకరమైన ధోరణిని వీడాలి.

రైతులకు ఆదాయాన్ని పెంచే స్వేచ్ఛా మార్కెట్ వల్ల దేశ ఆహారభద్రత మరింత పటిష్టమవుతుంది. అందరికీ పౌష్టికాహారాన్ని అందించే ఏర్పాటుతో పాటు దేశ ఆర్థిక, సామాజికాభివృద్ధికి కూడా విశేషంగా దోహదం చేసే హేతుబద్ధమైన విధానమది. ఆహార భద్రత పేరుతో ఇప్పుడు మనం అవినీతిమయమైన ప్రజాపంపిణీ వ్యవస్థ మీద రోజుకు రూ.300 కోట్లు వెచ్చిస్తున్నాం. ఇందులో చాలామేర వృథా అవుతుందని చాలామందికి తెలుసు. అయినా పేదలకు ఏదో చేసేస్తున్నామనే పేరుతో రైతుల్ని, దేశాన్ని దెబ్బతీస్తున్నాం. దేశ జనాభాలో ఎక్కువలో ఎక్కువగా 15శాతానికి ఉచితంగా ఆహారధాన్యాల పంపిణీ అవసరమవుతుంది. వారికి ఆహారం అందుబాటులోకి తెచ్చేందుకు కూపన్లు, ఆహార స్టాంపులు, ఇతరత్రా పద్ధతుల్లో ఏర్పాటు చేయాలితప్ప ప్రజాపంపిణీ వ్యవస్థ,




రేషనింగ్ వంటి పాత యుద్ధాలనాటి విధానాలెందుకు? ఈ రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి స్వేచ్ఛామార్కెట్‌లో అందరికీ అందుబాటు ధరల్లో ఆహారధాన్యాల్ని అందించేందుకు కొత్తపద్ధతుల్ని అమలుచేయాలి.

వ్యవసాయం ఈరోజు విధిగా సబ్సిడీ ఇవ్వాల్సిన రంగంగా కనిపిస్తూ మనదేశానికి తప్పనిసరి భారంగా కనిపించవచ్చు. కానీ అది విధానపరమైన తప్పిదాల వల్ల కలుగుతున్న నష్టమే తప్ప వాస్తవం కాదు. పంట పొలాలు మున్ముందు ఆహారం, పరిశ్రమలకి ముడిసరకులతోపాటు, ఇంధనాన్ని ఉత్పత్తి చేసే క్షేత్రాలుగా మారి ఇంకా ఆదాయం పెరిగే, ఆర్థికవ్యవస్థకు గొప్ప చోదకశక్తిగా వ్యవసాయ రంగం మారే రోజులు రానున్నాయి. ఇప్పటికే బ్రెజిల్ వంటి పెద్ద వ్యవసాయ దేశాలలో ఈ మార్పులు కనిపిస్తున్నాయి. అందుకే ఈ రంగంలో తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక దృష్టితో రైతులకు ఆదాయాన్ని పెంచే స్వేచ్ఛా మార్కెట్ విధానాలను అమలుచేయాలి. దేశ ప్రజల ఆదాయంలో అంతరాల్ని తగ్గించాలి. వ్యవసాయం మీద మితిమీరిన సంఖ్యలో ఎల్లకాలం ఆధారపడకుండా చేసేందుకు వీలుగా, ఇతర మెరుగైన ఆదాయం లభించేలా నాణ్యమైన విద్య, ఉపాధి నైపుణ్యాలను పెద్దఎత్తున అందిస్తూ, వ్యవసాయ పరిశ్రమల్ని ఏర్పాటుచేయాలి.

ఎలాగైతే నిబద్ధత గల సభ్యులుండి, వారు ఇచ్చే విరాళాలతో నడిచే రాజకీయపార్టీ నల్లధనం వసూళ్లు లేకుండా ఆరోగ్యకరమైన రీతిలో నిర్మాణమై దేశ ప్రయోజనాలకు కాపాడగలుగుతుందో, అలాగే పన్ను డబ్బులు చెల్లించే బాధ్యతగల పౌరులతో కూడిన దేశం కూడా అవినీతిరహితంగా భావితరాలకు పటిష్టపునాదిగా నిర్మాణమవుతుంది. రైతులకు ఆదాయన్నిచ్చే వ్యవసాయ విధానాలను అమలుచేస్తే, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, పౌర సేవలు అందుతుంటే వారు స్వచ్ఛందంగా, సంతోషంగా పన్నులు చెల్లించి సుపరిపాలనలో తమ వంతు భాగస్వాములవుతారు. గ్రామాలను ఆర్థికాభివృద్ధి గల ఆహ్లాదకర పట్టణప్రాంతాలుగా రూపొందించుకుంటారు. వ్యవసాయానికి, ఇతర రంగాలకి మధ్య, అలాగే గ్రామ ప్రాంతాలకి, నగరాలకి మధ్య ఆదాయంలో, జీవన ప్రమాణాలలో అంతరం తొలగిపోతుంది. భవిష్యత్ భారత నిర్మాణంలో కీలకపాత్ర పోషించేలా వ్యవసాయరంగాన్ని పునర్నిర్మించేందుకు ఈ వ్యాసాల్లోని ఆలోచనలు ఎంతో దోహదపడతాయని ఆశిస్తున్నాను. ❁

# దేశానికి ఆహార భద్రత కల్పించిన రైతులకు ఆదాయ భద్రత వద్దా...?

- డా॥ పి. భాస్కరరావు
స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య

అసంబద్ధ మద్దతు ధరలు

వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరను సూచించడానికి జాతీయ స్థాయిలో ఒక కమిషన్ వుంది. దీని పేరు వ్యవసాయ పంటల ఖర్చులు, ధరల కమిషన్ (Commission for Agricultural Costs and Prices (CACP) కనీస మద్దతు ధరను ఇది సూచిస్తుంది. తుది ప్రకటన కేంద్రప్రభుత్వం చేస్తుంది.

స్థానికంగా రైతుల నుండి, స్థానికంగా ఇతర సంస్థల నుండి అభిప్రాయ సేకరణకు / ప్రత్యక్ష పరిశీలనకు ఈ కమిషన్ కొన్ని ప్రాంతాలలో క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తుంది.

ఈ క్రింద సూచించిన టేబుల్ ద్వారా పేర్కొనబడిన వ్యవసాయ ఉత్పత్తులకు గత 3 సంవత్సరాలుగా వ్యవసాయ పంటల, ధరల కమిషన్ ప్రకటించిన కనీస మద్దతు ధరలు. పెంపు రైతులు, కౌలు రైతులు వ్యవసాయ రంగం పట్ల, కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కనిపిస్తుంది. గత 3 సంవత్సరాలుగా ఒక్కొక్క పంటకు రూ. 50/- నుండి రూ. 100/- లు పెంచుతూ వచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధరలు లాభసాటి అయితే 1995 నుండి 2015 వరకు దేశ వ్యాప్తంగా సుమారు 3 లక్షల 25 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడవలసిన అవసరమున్నదా? అదే సంఘటిత రంగములో వుండి ప్రభుత్వ వేతనాలు పొందుతున్నవారు జీత భత్యాలు చాలక ఆత్మహత్యలకు పాల్పడిన వారు ఉన్నారా?

రైతులు, రైతు కూలీలు అసంఘటిత రంగంగా ఉన్న కారణంగా వారు పంటల వారీగా, ప్రాంతాల వారీగా కూలాల వారీగా విడిపోయి తమ సమస్యల పరిష్కారం కొరకు సంఘటితంగా పోరాడలేక నష్టపోతున్న విషయాన్ని గమనించవలసిన అవసరమున్నది. అదే సమయంలో సంఘటిత రంగంలో వున్న ఉద్యోగులు, వ్యాపారులు, లాయర్లు, డాక్టర్లు, ఉన్నత ఆదాయ వర్గాల వారు తమ కోర్కెలు, డిమాండ్లు సాధించడం కోసం ఉద్యమాల ద్వారా ఒత్తిడి ద్వారా బెదిరింపుల ద్వారా సాధించుకుంటున్నారు.

అన్ని రంగాల ద్వారా దేశానికి వస్తున్న జి.డి.పి. ఉదాహరణకు రూ. 100/- ఐతే దేశానికి ఆహార భద్రత కల్పించిన అన్నదాతల వ్యవసాయం ద్వారా వస్తున్నది రూ. 17/- మాత్రమే. ఈ రూ. 17/- ల దేశ ఆదాయాన్ని సుమారు 60 శాతం రైతులు,

| పంట రకం: | కనీస మద్దతు ధర | | |
|---|---|---|---|
| | 2013-14 | 2014-15 | 2015-16 |
| 1. వరి ఎ గ్రేడ్ | 1345 | 1400 | 1450 |
| 2. వరి సాధారణ రకం | 1310 | 1360 | 1410 |
| 3. మొక్కజొన్న | 1310 | 1310 | 1325 |
| 4. సజ్జలు | 1250 | 1250 | 1270 |
| 5. రాగులు | 1500 | 1550 | 1650 |
| 6. కందులు | 4300 | 4350 | 4425 |
| 7. పెసలు | 4500 | 4600 | 4650 |
| 8. మినుములు | 4300 | 4350 | 4425 |
| 9. వేరుశనగ | 4000 | 4000 | 4030 |
| 10. సోయాబీన్ | 2560 | 2560 | 2600 |
| 11. ప్రొద్దుతిరుగుడు | 3700 | 3750 | 3800 |
| 12. నువ్వులు | 4500 | 4600 | 4700 |
| 13. ప్రత్తి (మీడియమ్) | 3600 | 3750 | 3800 |



రైతు కూలీలకు అందుతుంది. అంటే ఒక రైతుకు/రైతు కూలీకి సరాసరి ప్రతి సంవత్సరం ఆదాయం సుమారు 20 వేల రూపాయలైతే అదే సంఘటిత రంగంలో వున్న ఉద్యోగులు, వ్యాపారులు, డాక్టర్లు, ఉన్నత ఆదాయ వర్గాల వారికి 5 నుండి 6 రెట్లు అధికంగా ఆదాయం పొందుతున్నారు. (రూ.లక్ష నుండి లక్షా ఇరవై వేల వరకు)

పై అంశాలకు పరిగణనలోకి తీసుకొని విశ్లేషిస్తే రైతులు, రైతు కూలీలు తమ కుటుంబపోషణలో భాగంగా ఆహారం, బట్టలు, వైద్యం, విద్య. పెండ్లిళ్ళు మొదలగు సామాజిక కార్యక్రమాల కోసం వ్యవసాయం ద్వారా వస్తున్న ఆదాయం చాలటం లేదు. మరియు కరువు, లాభసాటి ధరలు లేక అధిక వడ్డీలు కట్టలేక రైతులు ఆత్మత్యాగాలు చేస్తున్న విషయం పరిగణనలోకి తీసుకోవాలి.

జాతీయ స్థాయిలో వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరను సూచించే కమిషన్ పరిగణనలోకి తీసుకునే అంశాలు రైతుల పంటలకు లాభసాటి ధర అందించటానికి బదులు దానిని నియంత్రించటానికి దోహదం చేసే అంశాలు ఎక్కువగా ఉండటంతో రైతుల పట్ల కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి అద్దం పడుతున్నాయి. ఇన్ని ఆంక్షల మధ్య పంటల ధరలు నిర్ణయించడం వల్ల అవి లాభసాటి కాక పోగా గిట్టుబాటు కూడా కాని స్థితి వచ్చింది. రైతులను దెబ్బతీసి దివాలతీయించి ఆత్మహత్యలకు దారి చూపిస్తున్న ఈ విధానాలు దేశ ఆహార భద్రతకి, గ్రామీణాభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగించేవిగా ఉన్నాయి.

కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఆదాయ భద్రతకోసం ఎం.ఎస్. స్వామీనాధన్ కమిషన్ నివేదిక ఆధారంగా జాతీయ వ్యవసాయ విధానాన్ని ప్రకటించి అందుకు అనుగుణంగా చట్టాలు రూపొందించి ఏ రైతు కూడా వ్యవసాయం చేయటం ద్వారా ఆత్మహత్యలకు పాల్పడకుండా చూడవలసిన అవసరాన్ని గుర్తించాలి.

1. మద్దతు ధర కాదు – లాభసాటి ధర కావాలి
   రైతుకి ఆదాయ భద్రతే – దేశానికి ఆహార భద్రత
2. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి.
   ప్రతి గ్రామానికి ఒక అగ్రిక్లినిక్ – ప్రతి రైతుకు భూసార పరీక్ష కార్డులు
3. వ్యవసాయ రంగాన్ని సరళీకృతం చేయాలి
   స్వేచ్ఛా వాణిజ్యానికి ద్వారాలు తెరవాలి
4. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి – దిగుమతి వ్యాపారం రైతులు ప్రయోజనాలకు అనుగుణంగా మారాలి. ❁

# వ్యవసాయ సంక్షోభంపై అదేం చర్చ రాజ్‌దీప్‌జీ!

దేశవ్యాప్తంగా వ్యవసాయ సంక్షోభం ముదురుతూ తెలంగాణలో రైతులు పెద్దసంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతుండటంతో ఇండియా టుడే టీవీ సెప్టెంబర్ 22న ప్రైమ్‌టైమ్‌లో రాత్రి 9గంటలకు లైవ్ చర్చా కార్యక్రమం నిర్వహించింది. చిన్నవయసులోనే అబ్బురపరిచేస్థాయి టెలివిజన్ రిపోర్టర్‌గా ఎదిగిన రాజ్‌దీప్ సర్దేశాయ్ ఈ కార్యక్రమానికి ప్రెజెంటర్‌గా వ్యవహరించారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, తెరాస ఎంపీ కల్వకుంట్ల కవిత, రైతు సంఘ నేత చెంగల్‌రెడ్డి చర్చలో పాల్గన్నారు. కానీ, 'రుణమాఫీలు, ఉచిత విద్యుత్తు వంటి తాయిలాలు-రైతులు పంటల్ని ఇతర ప్రాంతాల్లో అమ్ముకోనీకుండా బిచ్చం వేసినట్టు మద్దతు ధర-ఆత్మహత్యలు-ఎక్స్‌గ్రేషియాలు' చుట్టూనే తిరుగుతూ దశాబ్దాల తరబడి వ్యవసాయాన్ని ఒక కుట్రపన్నినట్టు నాశనం చేస్తున్న వరస ప్రభుత్వ విధానాలను సమూలంగా మార్చి 'స్వావలంబన, స్వేచ్ఛా వాణిజ్యంతో రైతుకు ఆదాయం-రైతు కుటుంబాలకు విద్య, ఆరోగ్యం-రైతుల ఎదుగుదలకు గ్రామాల చుట్టూ ఆర్థిక కేంద్రాలుగా పట్టణాలు' వంటి నూతన విధానాల చుట్టూ తిప్పి, 2012లో కేవలం ఒక్క సీజన్‌లోనే ఒక్క బీపీటీ పంటకు రూ.3600 కోట్ల లాభాన్ని తెలుగు రాష్ట్రాల్లోని రైతులకు అందించి, ఈవేళ ప్రపంచంలోనే నెంబర్‌వన్ బియ్యం ఎగుమతిదారుగా భారత్ అవతరించటానికి కారణమైన జేపీ పరిష్కారాలు ఈ సంక్షోభసమయంలో అవసరమని ఎదురుచూసిన లోక్‌సత్తా వారికి, అభిమానులకు, ఆలోచనాపరులకు రాజ్‌దీప్ నడిపిన చర్చ తీరు నిరాశపరిచింది.

అసలు చర్చను ఎత్తుకోవటమే అవగాహనలేని రీతిలో తిరుపతికి పోటీగా యాదాద్రిని తయారుచేయటానికి రూ.800 కోట్లు కేటాయించకుండా రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు ఆ డబ్బును కేటాయించాల్సింది అనే భావాన్ని స్ఫురించేలా ఎద్దేవాతో మొదలుపెట్టారు. గుళ్లూగోపురాలు, ఇతర ప్రార్థనామందిరాల విషయంలో జోక్యం చేసుకోవటం ప్రభుత్వం పని కాదని తేల్చిచెబుతూనే, రైతుల ఆత్మహత్యలకు, దానికి సంబంధం లేదని జేపీ వివరించే ప్రయత్నం చేశారు. రుణమాఫీల పేరుతో వేల కోట్లు వృధాగా ఖర్చు చేసి ఈవేళ చిన్నరైతులకు బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి అప్పుపుట్టకుండా చేయటం



వల్ల వారు అధిక వడ్డీ వ్యాపారుల చేతుల్లో విలవిలలాడు తుండటం, ఉచిత విద్యుత్ వల్ల బోర్లు మీద బోర్లు వేసి లక్షలు ధారపోయటం, కష్టపడి పండించిన పంటకు ధర వచ్చేంత వరకు నిల్వ చేసుకునేందుకు గిడ్డంగులు, ప్లెడ్జి రుణాల సదుపాయాలు లేకపోవటం, రైతులకు మంచి ధర వచ్చేలా పనిచేయాల్సిన మార్కెట్‌యార్డులు రాజకీయ నేతల కబంధ హస్తాల్లో చిక్కుకుపోవటం, వ్యవసాయ ఉత్పత్తి ఖర్చును తగ్గించాల్సింది పోయి ఎకరాకు నాలుగైదు లక్షలు ఖర్చయ్యే ప్రాణహిత-చేవెళ్ల వంటి మతిమాలిన పథకాలను చేపట్టటం, పంటను స్వేచ్ఛగా ఎక్కడికైనా ఎగుమతి చేసుకుని లాభాలు ఆర్జించే అవకాశాలు లేకపోవటం వంటి ప్రభుత్వాల విధానాల వల్లే తెలంగాణ, ఇతర రాష్ట్రాల్లో రైతులు ఉన్నకొద్దీ సంక్షోభంలో కూరుకుపోతున్నారని జేపీ స్పష్టంచేశారు. రైతుల దుర్భర దురవస్థకి పాలకుల పాపం తప్ప ప్రకృతి శాపం కారణం కాదని గట్టిగా చెప్పేందుకు జేపీ ప్రయత్నించారు. అయితే ఇవేవీ వినిపించుకునే మూడ్‌లో రాజ్‌దీప్ లేరు.

''అయితే మొత్తం మీద గుడికి నిధులు కేటాయించటానికి, రైతుల ఆత్మహత్యలకు సంబంధం లేదని చివర్లో తేలింది. మొదట్లో ఒకటనుకున్నాం, చివరికి ఇంకోటి తేలింది. వ్యవసాయ సంక్షోభానికి ఎవ్వరూ పరిష్కారాలు చెప్పలేకపోయారు. దీనిపై ఇంకోసారి లోతుగా చర్చించాల్సుంది. ఎందుకంటే దేశజనాభాలో 70శాతం మంది ఈ రంగం మీదే ఆధారపడివున్నారు" అని హ్యాంగోవర్‌తో కూడిన హావభావాల మధ్య సిన్సియారిటీని ప్రతిఫలింపచేసే ప్రయత్నం చేస్తూ చర్చను రాజ్‌దీప్ అసహనంగా ముగించారు. పనికిమాలిన షీనా బోరా హత్య, సోమనాథ్ భారతి భార్య ఫిర్యాదు వంటి విషయాల గురించి గంటల తరబడి చర్చించిన ఛానళ్లు కోట్లాది రైతులను కబళిస్తూ సమాజ మనుగడను క్రమంగా సంక్షోభంలోకి నెడుతున్న వ్యవసాయ సంక్షోభం గురించి చర్చించటానికి కేటాయించేది పదిహేను నిముషాలా? ఈ కొద్దిసేపులో కూడా గుక్కతిప్పుకోకుండా పరిష్కారాలను చెప్పేందుకు జేపీ ప్రయత్నించినా ఏమీ పరిష్కారాలు రాలేదని ముక్తాయింపు ఇస్తారా? అసలు మీరు చర్చను విన్నారా? లేక పావుగంట టైంపాస్ చేసినట్టు కార్యక్రమాన్ని నిర్వహించారా?

ఎంపీ కవిత, చెంగల్‌రెడ్డి మాటల్లోని పక్షపాత రాజకీయ ధోరణుల్ని పక్కనపెట్టినా వారు చెప్పిన కొన్ని విలువైన సూచనల్ని కూడా రాజ్‌దీప్ పట్టించుకోలేదు. మన జాతీయ ఛానళ్లు పేరులో తప్ప ప్రసారాల్లో ఇంకా జాతీయ స్వభావాన్ని సంతరించుకోలేదని, ఎక్కువ వార్తలు ముంబయి, ఢిల్లీ వంటి ప్రాంతాలకే పరిమితమవుతాయని రాజ్‌దీప్ స్వయంగా పలు సందర్భాలలో విచారం వ్యక్తం చేశారు. తన వైఫల్యం మీద తానే హాస్యమాడుకోగల సంస్కారం ఆయనలో ఉంది. జేపీ బహుశా భారతదేశంలోనే అత్యంత విజ్ఞుడైన మేధావి అని రాజ్‌దీప్ స్వయంగా ఒకసారి వ్యాఖ్యానించారు. ఆ స్థాయి జర్నలిస్టు కీలకసమయంలో రైతుల సంక్షోభంపై చర్చను ఇలా నడిపించటం బాధాకరం. ఉల్లిపాయలు, టమాటా ధరలు పెరిగితే

**రైతులకు మంచి ధర వచ్చేలా పనిచేయాల్సిన మార్కెట్ యార్డులు రాజకీయ నేతల కబంధ హస్తాల్లో చిక్కుకు పోవటం, వ్యవసాయ ఉత్పత్తి ఖర్చును తగ్గించాల్సింది పోయి ఎకరాకు నాలుగైదు లక్షలు ఖర్చయ్యే ప్రాణహిత-చేవెళ్ల వంటి మతిమాలిన పథకాలను చేపట్టటం, పంటను స్వేచ్ఛగా ఎక్కడికైనా ఎగుమతి చేసుకుని లాభాలు ఆర్జించే అవకాశాలు లేకపోవటం వంటి ప్రభుత్వాల విధానాల వల్లే తెలంగాణ, ఇతర రాష్ట్రాల్లో రైతులు ఉన్నకొద్దీ సంక్షోభంలో కూరుకు పోతున్నారని జేపీ స్పష్టం చేశారు.**

గగ్గోలు పెట్టే మీడియా ఉల్లి, టమాటా ధరలు తగ్గి రైతులు రోడ్డున పడితే మాత్రం రొటీన్ విషయంలా కవరేజీ ఇస్తుంది. రాజ్‌దీప్ లాంటి వారే ఇలా చర్చను పేలవంగా, తప్పనిసరి తద్దినంలా నిర్వహిస్తే ఇక రైతుల గొంతును వినిపించేదెవరు?

జర్నలిస్టులలో చాలామంది రైతు నేపథ్యం నుంచి వచ్చినవారు ఉన్నారు. రైతులకు సానుభూతులు అక్కర్లేదు, కానీ వారి సమస్యలకు నిజమైన పరిష్కారాల్ని అందించి వాటిని సాధించేందుకు తోడ్పాటు ఇవ్వగలవారు కావాలి. ఇందులో మీడియాది కీలకపాత్ర. రైతులకు, వినియోగదారులకు లాభసాటిగా ఉండేలా వ్యవసాయాన్ని తయారుచేసేందుకు నిర్మాణాత్మక చర్చల్ని మీడియా విస్తృతంగా చేపట్టి ప్రజాభిప్రాయాన్ని మలచాలి. రాజకీయ విధానాల భరతం పట్టాలి. గ్రామాల్లో, వ్యవసాయంలో ఉన్న పాపానికి, మిగతావారికి వచ్చే ఆదాయంలో కేవలం ఏడోవంతు మాత్రమే పొందుతూ సంక్షోభంలో నలిగిపోతున్న రైతుల వల్ల రాజకీయ, ఆర్థిక, సామాజిక సంక్షోభం పెచ్చరిల్లి సమాజాన్ని ఛిన్నాభిన్నం చేయకముందే మేలుకోవాలి. ❀

# రైతుల మార్కెట్ యార్డుల్లో చెలరేగిపోతున్న రాజకీయ నేతలు




మార్కెట్ యార్డు వద్ద రాళ్లు రువ్వుకుంటూ పరుగెత్తుతున్న కార్యకర్తలు
కుర్చీలు అడ్డుపెట్టి దయాకర్‌రావును తీసుకొస్తున్న తెదేపా కార్యకర్తలు

రైతులు పండించిన పంటలకు సరైన ధర రాకుండా రుణభారం పెరిగిపోవటానికి మార్కెట్ యార్డుల్ని రాజకీయ నేతలు కబ్జా చేయటం ఒక ముఖ్య కారణం. మార్కెట్ యార్డులు ఎక్కువగా ఉండే తెలంగాణ ప్రాంతంలో చాలా చోట్ల కనీస వసతులు కూడా ఉండవు. తెచ్చిన పంటను ఎండవానల నుంచి కాపాడే ఆచ్ఛాదనకు కనీసం టార్పాలిన్లు కూడా ఉండవు. నిల్వకు, ఆరబెట్టటానికి సదుపాయాలుండవు. పందికొక్కులు స్వైరవిహారం చేస్తుంటాయి. మహిళారైతుల అవస్థలైతే చెప్పనలవి కావు. కనీసం మరుగుదొడ్డి సదుపాయం ఉండవు. లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ పార్టీలకతీతంగా రైతు చైతన్య యాత్రలను చేపట్టినప్పుడు కరీంనగర్ జిల్లాలోనూ, సిద్ధిపేట వంటి చోట్లా మార్కెట్‌యార్డులలో సౌకర్యాల ఏర్పాటుకి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టేలా చేయగలిగారు. దీని మీద రైతులలో చైతన్యం తేవటంతో పాటు అసెంబ్లీలో ఈ సమస్యను లేవనెత్తి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

రైతులకు ఆదాయం పెంచటం చుట్టూ వ్యవసాయాన్ని తిప్పాలని, ఇందుకోసం మార్కెట్ యార్డుల్ని పూర్తిగా రైతుల చేతుల్లో పెట్టి ప్రభుత్వం కేవలం అవినీతి జరక్కుండా పర్యవేక్షణ మాత్రమే చేయాలని జేపీ డిమాండ్ చేశారు. అయితే మార్కెట్‌లు రాజకీయ పార్టీల అడ్డాలని, రైతులు ధరలు లేక అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడితే పరిహారం చుట్టూ రాజకీయం చేసి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తాం తప్ప మార్కెట్ యార్డుల్ని మాత్రం అప్పచెప్పం అని నేతలు జులుం చేస్తున్నారు. మార్కెట్ యార్డులలో పేరుకే రిజర్వేషన్లు తప్ప అందులో కూడా రాజకీయ నాయకులదే పెత్తనం. మార్కెట్ యార్డుల్ని కబ్జా చేస్తున్న అధికార పార్టీవారి ఆధిపత్యాన్ని అడ్డుకోవటానికి ప్రతిపక్షం కూడా బరితెగిస్తోంది. తాజాగా వరంగల్ జిల్లా పాలకుర్తి మార్కెట్ యార్డుకు చాకలి ఐలమ్మ పేరు పెట్టిన నేపథ్యంలో జరిగిన ఒక కార్యక్రమం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమితి, తెలుగుదేశం నేతలు ఇదేదో తమ సొంత అడ్డా అన్నట్టు ఆధిపత్యం కోసం పరస్పర దాడులు చేసుకున్నారు. దీంతో రైతులకు మార్కెటింగ్ సదుపాయాలు, ధరల స్థిరీకరణకు, లాభాలకు నిల్వ ఏర్పాట్లు వంటి విషయాలు గురించిన ఒక్క ముక్క కూడా లేకుండానే మీడియాలో తెరాస, తెదేపాల మధ్య దాడులకు సంబంధించి భారీ కథనాలు వచ్చాయి. రైతులు కులం, ప్రాంతం, పార్టీ వంటి ఉచ్చులలో చిక్కుకోకుండా కేవలం రైతులుగా సంఘటితమై తమ ప్రయోజనాల కోసం పోరాడితే తప్ప ఇలాంటి రాజకీయ పెత్తనాలకు తెరపడదు. ❁

# వ్యవసాయేతర రంగాలలో ఉద్యోగాల్ని సృష్టించాలి, చర్చ ఇప్పుడు విద్య, ఆరోగ్యం వైపు మళ్లాలి: జేపీ



మనదేశంలో వ్యవసాయరంగ సంక్షోభానికి పాలకుల పాపమే ప్రధాన కారణమని, విధానాల్ని మార్చకుండా రైతులు, గ్రామాల దుస్థితిపై ఎంత సానుభూతిని ఒలకబోసినా ప్రయోజనముండదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

వ్యవసాయ సంక్షోభంపై చట్టసభల్లో, పౌరసమాజంలో చర్చపై జేపీ స్పందిస్తూ, చర్చ ఇప్పుడు విద్య, ఆరోగ్యం వైపు మళ్లాలని, పేదరికానికి అవి మాత్రమే విరుగుడని స్పష్టంచేశారు. రైతులు సుదీర్ఘకాలంగా దుర్భర పరిస్థితులలోనే జీవిస్తున్నారని, యువతలో కొద్దిమంది మాత్రమే వ్యవసాయం పట్ల ఆసక్తి చూపుతున్నారని అన్నారు. రైతుకి ఆదాయాన్నిచ్చే ఉత్పాదకత పెంపు, మార్కెట్ సంస్కరణలతో పాటు వ్యవసాయేతర రంగాలలో ఉద్యోగాల్ని కూడా ఇప్పుడు పరిష్కారంలో భాగంగా చూడాలన్నారు. వ్యవసాయేతర రంగాలకు భూమిని వినియోగించటాన్ని పాపంగా భావించలేమన్నారు. వస్తూత్పత్తి, సేవలతో ఉద్యోగాలను అందించే దేన్నయినా ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్యం, విద్యకు అయ్యే ఖర్చుతోపాటు, తక్కువ ఉత్పాదకత, అవినీతి, అధ్వాన్న ప్రభుత్వ సేవలు – మౌలిక వసతులు గ్రామీణ పేదరికానికి కారణమన్నారు.

వ్యవసాయాన్ని పారిశ్రామిక, సేవారంగాలతో సంధానం చేయటం, చిన్న పట్టణాల అభివృద్ధి, మెరుగైన విద్య, ఆరోగ్యం అందించటం ద్వారా గ్రామాలలో పరిస్థితిని మెరుగు పరచగలంతప్ప, యథాతథ విధానాలతో కాదని జేపీ అన్నారు.

ఏకాకి గ్రామాల్లో జీవితం అద్భుతం అనే ఊహాప్రపంచంలోనే ఇంకా విహరిస్తుంటే పేదలు దారుణంగా దెబ్బతింటారని జేపీ హెచ్చరించారు. పూర్తిస్థాయి, న్యాయమైన పరిహారం చెల్లింపుతో వ్యవసాయేతర అవసరాలకు భూ సేకరణ మనకు అవసరమన్నారు. అర్థరహితమైన రీతిలో ఏకాభిప్రాయం, ఆచరణసాధ్యంకాని నిబంధనలతో సేకరణ అంటే, పరిశ్రమల్ని, ఉద్యోగాల్ని పెంచలేమన్నారు. గ్రామీణ యువత ఏం కోరుకుంటున్నారో తెలుసుకుంటే మంచిదన్నారు.

భూ సేకరణ ఉమ్మడి జాబితాలో అంశమని, తమ అవసరాలకు తగ్గట్టు చట్టాలు చేసుకునే వెసులుబాటును రాష్ట్రాలకు కల్పించాలని జేపీ అన్నారు. కేంద్రం చేస్తున్న కఠిన చట్టాల వల్ల మేలు కంటే నష్టమే ఎక్కువ జరుగుతోందన్నారు. విద్యాహక్కు, ఆహార భద్రత వంటి చట్టాలను కేంద్రం సదుద్దేశంతోనే చేసినా అమలులో అవి అధ్వాన్నమని తేలిందని, అందుకే అలాంటి చట్టాలను రాష్ట్రాలకు వదిలెయ్యాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ❀

# జిందాల్ భూసేకరణలో అక్రమాలపై లోక్‌సత్తా ఆరోపణలు నిజమని తేల్చిన లోకాయుక్త

## భూముల్ని తిరిగి రైతులకివ్వండి లేదా కోరితే మరో ప్రాజెక్టు ఏర్పాటు చేయండని చంద్రబాబుకి జేపీ లేఖ

*విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలో **2008**లో అనుమతి పొందిన జిందాల్ అల్యూమినా కర్మాగారం కోసం చేసిన సుమారు **1048** ఎకరాల భూసేకరణ పరిహారం చెల్లింపుల్లో భారీ అక్రమాలు జరిగాయని లోక్‌సత్తా పార్టీ చేసిన ఆరోపణలు వాస్తవమేనని ఏసీబీ, లోకాయుక్త తాజాగా ధృవీకరించినందున, ఆరేళ్లయినా ప్రహరీ గోడ తప్ప ఫ్యాక్టరీ నిర్మాణం, ఉద్యోగాలు లేవు కనక వెంటనే జిందాల్ కర్మాగారానికి అనుమతుల్ని రద్దు చేయాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిందాల్ భూసేకరణలో నిరుపేదలు సాగుచేసుకునే డి.పట్టా భూములు **866** ఎకరాలు, జిరాయతీ భూములు **182** ఎకరాలు ఉన్నాయని, వీరికి అందాల్సిన పరిహారాన్ని రాజకీయ నేతలు, అధికారులు కుమ్మక్కయి బినామీ పేర్లతో కాజేశారని అన్నారు. లోకాయుక్త తీర్పు నేపథ్యంలో, నష్టపోయిన రైతులకు పూర్తి పరిహారం చెల్లించటంతోపాటు అనుమతుల్ని రద్దు చేసి భూముల్ని తిరిగి రైతులకు అప్పగించాలని, జిందాల్‌కు ఇప్పుడు మార్కెట్‌లో కూడా అనుకూల పరిస్థితులు లేవు గనక ఒకవేళ అదే స్థలంలో ప్రభుత్వం ఏదైనా కొత్త కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే వెంటనే అక్కడ ప్రజాసభ ఏర్పాటు చేసి వారిని ఒప్పించి ప్రారంభించాలని అన్నారు.*

*ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి తాను రాసిన లేఖను జయప్రకాష్ నారాయణ్ అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మీడియాకు విడుదల చేశారు. లోక్‌సత్తా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హైమా పోతినేని, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బొంతు సాంబిరెడ్డి కూడా సమావేశంలో పాల్గొన్నారు.*

*ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, జిందాల్ భూసేకరణ పరిహారం చెల్లింపులో అక్రమాలపై **2008** నుంచి లోక్‌సత్తా పోరాడుతోందని, ఆ ప్రాంతంలోని గ్రామాలలో తాను స్వయంగా పర్యటించానని, విచారణకు ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి నివేదికను ప్రభుత్వానికి అందచేశామని, అసెంబ్లీలో తాను లేవనెత్తానని, చివరికి ఏసీబీ, లోకాయుక్తకు ఫిర్యాదు చేశామని, ఇప్పుడు అవినీతి రుజువైందని తెలిపారు. చంద్రబాబు నాయుడికి జేపీ రాసిన లేఖ పూర్తి పాఠం:*

"ప్రియమైన చంద్రబాబు నాయుడు గారు,

విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలో ఏటా 1.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో జిందాల్ అల్యూమినా కర్మాగారానికి 2008 జూన్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 1048 ఎకరాల 65 సెంట్ల భూమిని కేటాయించింది. అయితే భూసేకరణలో కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కయి బినామీ పేర్లతో రైతులకు రావాల్సిన సొమ్మును మింగేశారు. ఇప్పటిదాకా ప్రభుత్వం చెల్లించిన రూ.22.44 కోట్లలో కనీసం రూ.10కోట్లదాకా ఇలా బినామీ దోపిడీ జరిగింది. నిజమైన రైతులకు పరిహారం అందకపోవటమో, లేక నామమాత్రపు పరిహారం అందటమో మాత్రమే జరిగింది. భూసేకరణ పరిహారం చెల్లింపులో ఈ రాజకీయ, అధికార దోపిడీపై విచారణకు లోక్‌సత్తా పార్టీ నేత భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో రిటైర్డు రెవిన్యూ డిప్యూటీ కలెక్టర్లు వై.సత్యనారాయణ, పి. కోటేశ్వరరావు, రిటైర్డ్ తహశీల్దార్ ఎస్. రామ్మూర్తి, పార్టీ నేతలు డి.సూర్యారావు, పి.కె.వి.ఎస్.పి వర్మలతో లోక్‌సత్తా ఓ కమిటీని ఏర్పాటు చేసింది. నేను స్వయంగా భూ సేకరణ గ్రామాలలో పర్యటించి రైతుల నుంచి వాస్తవాలు తెలుసుకున్నాను. లోక్‌సత్తా కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అమ్మపాలెం, ముకుందాపురం, అడ్డతీగ, చిలకలగెడ్డ, మూలబడ్డవర, కిల్తంపాలెం కేవలం ఈ ఐదు గ్రామాలలోనే నకిలీ ఫసలీలు సృష్టించి 12 మంది బినామీదార్లకు రూ.35.1లక్షలను చెల్లించినట్టు బైటపెట్టింది. లోక్‌సత్తా కమిటీ నివేదికను సెప్టెంబర్ 8, 2008న నేను అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాను. అయినా చర్యలు లేకపోవటంతో అన్ని ఆధారాలతో 2010లో ఏసీబీకి, లోకాయుక్తకు లోక్‌సత్తా నేతలు ఫిర్యాదు (1943/2010/బి2/1819/2015)చేశారు. తర్వాత జిందాల్ భూసేకరణ అవకతవకలపై అసెంబ్లీలో లేవనెత్తాను.

చివరికి ఇన్నేళ్ల తర్వాత ఏప్రిల్ 21, 2015న ఏసీబీ తన దర్యాప్తు నివేదికను ప్రభుత్వానికి అందచేస్తూ, అవతవకలపై లోక్‌సత్తా పార్టీ ఇచ్చిన వివరాలు వాస్తవమేనని చెబుతూ, అక్రమాలలో భాగస్వాములైన రెవిన్యూ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తూ నివేదికను ఇచ్చింది. తర్వాత

లోకాయుక్త కూడా తుది తీర్పునిస్తూ లోక్‌సత్తా బైటపెట్టిన అక్రమాలు, అవినీతి వాస్తవమేనని ధృవీకరించింది.

ఈ నేపథ్యంలో, లోకాయుక్త తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే స్పందించి జిందాల్ భూసేకరణ అవకతవకల్లో దోషుల్ని కఠినంగా శిక్షించటంతోపాటు నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి. భూసేకరణ సమయంలో డి. పట్టా ఎకరాకి రూ. 2.05లక్షలు, జిరాయితీ భూమి ఎకరాకి రూ. 2.25లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపు కోవాలనుకున్నా లోక్‌సత్తా పట్టుబట్టటం వల్ల రైతులకు ప్రతి ఎకరా భూమిలో 10వ వంతు స్థలంలో ఇల్లు లేదా రూ. 1లక్షా 50వేల పరిహారం, కంపెనీ వచ్చాక కొన్ని షేర్లు, ప్రతి భూ యజమాని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని, పాఠశాల, లైబ్రరీ, పార్కులు, విశాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీల్ని ప్రభుత్వం ఇచ్చింది. అయితే అటు జిందాల్ కంపెనీవారు, ఇటు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరకుండా అసలు కర్మాగారమే ఇప్పటివరకూ మొదలవలేదు కాబట్టి, ప్రాజెక్టును రద్దు చేసి ఇన్నాళ్లూ ఫలసాయం పొందకుండా నిర్వాసితులుగా మిగిలిపోయిన రైతులకు భూముల్ని వెంటనే తిరిగి ఇవ్వాలని లోక్‌సత్తా కోరుతోంది. రైతుల దుస్థితి దృష్ట్యా ఈ విషయంలో వేగంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

యువతకు ఉద్యోగాలనిచ్చే పారిశ్రామికాభివృద్ధి కోసం భూసేకరణకు లోక్‌సత్తా వ్యతిరేకం కాదు. కానీ ఆ పేరుతో రైతుల్ని, భూ యజమానుల్ని మోసం చేస్తే సహించకూడదు. ఆంధ్రప్రదేశ్‌లో భూసేకరణ, సమీకరణకు ముమ్మరంగా పలుచోట్ల ప్రయత్నాలు జరుగుతున్నందున, అవసరమైన మేరకే పరిమితంగా భూ సేకరణ చేయాలని, రైతుల, భూ యజమానుల ప్రయోజనాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని కోరుతున్నాం." పోలవరాన్ని ఫణంగా పెట్టి ప్రారంభించిన పట్టిసీమ వట్టిసీమే

జేపీ మాట్లాడుతూ, సమగ్ర జలవిధానంలో భాగంగా గోదావరి జలాల్ని కృష్ణా నదిలోకి మళ్లించాలని, అందుకోసం రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలకు మేలు చేసే పోలవరం బహుళార్థ ప్రాజెక్టును చేపట్టాలని మొట్టమొదటి నుంచి వాదిస్తున్నది లోక్‌సత్తా అని, ఈవేళ పోలవరాన్ని ఫణంగా పెట్టి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన పట్టిసీమ ప్రాజెక్టు వల్ల ఒరిగేదేమీ ఉండదని జేపీ అన్నారు. పోలవరంకు జాతీయహోదా ఉన్నా, తన పార్టీ ఎంపీయే కాంట్రాక్టర్‌గా ఉన్నా ఇంతవరకూ బెత్తెడు కాంక్రీట్ పని జరగలేదని, ఇంతజరుగుతున్నా చంద్రబాబు పట్టించుకోకుండా పట్టిసీమ జపం చేయటం విచిత్రంగా ఉందన్నారు. నీటినిల్వకు రిజర్వాయరు పోలవరం ప్రాజెక్టుకు కీలకమని, అటువంటి నిల్వ ఏర్పాటు లేకుండా పట్టిసీమ ద్వారా రాయలసీమకు, కోస్తాలోని మెట్ట ప్రాంతాలకు ఎలా నీరు అందిస్తారని ప్రశ్నించారు. వర్షాలతో గోదావరిలోకి జలాలు వచ్చే సమయానికి కృష్ణాలో కూడా అదే పరిస్థితి ఉంటుందని, అప్పుడు గోదావరి నీటిని ఎక్కడ నిల్వ చేస్తారని అన్నారు. పట్టిసీమ ప్రారంభించిన సమయంలో కూడా ప్రకాశం బ్యారేజీ వద్ద కూడా నీరు నిండుగా ఉందని, రెండు రోజులు పంప్ చేస్తే అక్కడ నీటి నిల్వకు అవకాశమే ఉండదన్నారు. రెండు రాష్ట్రాలకే కాకుండా జాతీయస్థాయిలో కూడా కీలకమైన పోలవరం ప్రాజెక్టును వేగంగా సాధించుకునేందుకు తెలుగువారంతా పార్టీలకతీతంగా పోరాడాలని విజ్ఞప్తి చేశారు.

మతాల్ని, కులాల్ని ఘనీభవింపచేయటం, మతాల మధ్య, కులాల మధ్య విద్వేషాల్ని సృష్టించటం ద్వారా లబ్ధి పొందటం ఇటీవల ఒక రాజకీయ విధానంగా ప్రాచుర్యం పొందుతోందని, ఇలాంటి శక్తుల పట్ల ప్రజలు, మీడియా అప్రమత్తంగా ఉండాలని జేపీ అన్నారు. కులం, మతం వంటి వాటికి వ్యతిరేకంగా హేతుబద్ధ భావాల్ని వ్యాపింపచేసినందుకు గోవింద పన్సారీ, ఎంఎం కాలబుర్గీ వంటి వారిని కాల్చి చంపటం, జైనుల ఉపవాస దినాలు కాబట్టి ఇతరులు మాంసం తినకూడదని నిషేధాజ్ఞలు విధించటం, మహ్మద్ ప్రవక్త బాల్యంపై చిత్రానికి సంగీతం సమకూర్చినందుకు ఎ.ఆర్ రెహమాన్‌పై ఫత్వా జారీ, టిప్పుసుల్తాన్‌లో నటిస్తానన్నందుకు రజనీకాంత్‌ని హెచ్చరించటం వంటివి దేశ సమగ్రతకు, అభివృద్ధికి గొడ్డలిపెట్టులన్నారు. ఇలాంటి రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని, ఉదార, బహుళత్వ విలువల్ని పెంపొందిస్తూ అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ లోక్‌సత్తా చేస్తున్న నిర్మాణాత్మక కృషిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జిందాల్ భూసేకరణ పరిహారం చెల్లింపులో అక్రమాల్ని బైటపెట్టటం, అగ్రిగోల్డ్, అక్షయగోల్డ్‌లో ఖాతాదారుల ప్రయోజనాలను పరిరక్షించటం, ఓ మంత్రి కంపెనీ నుంచి విశాఖపట్నం పౌరగ్రంథాలయం స్థలాన్ని తిరిగి ప్రభుత్వ పరం చేయటం, ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేసి కొన్ని ప్రయివేటు స్కూళ్లు చేస్తున్న దోపిడీని అనంతపురంలో బైటపెట్టి మీడియాకు విడుదల చేయటంలో లోక్‌సత్తా కొత్త రాజకీయ సంస్కృతితో తాజా విజయాలు సాధించిన పార్టీ నేతలు భీశెట్టి బాబ్జీ, అశోక్‌లను జేపీ అభినందించారు. ప్రయివేటు స్కూళ్లలో దోపిడీ వివరాల్ని సేకరించి విద్యాసంస్కరణల కోసం కార్యక్రమం చేపట్టాలని లోక్‌సత్తా కార్యకర్తలను కోరారు.

ప్రజలు తమకు అధికారం ఇవ్వకపోయినా ప్రజాప్రయోజనాల కోసం మంత్రుల్ని కూడా ఢీకొని లోక్‌సత్తా పంథాలో ఉత్తరాంధ్రలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా కీలక విజయాల్ని సాధించామని, ఈ పోరాటాన్ని ప్రణాళికాబద్ధంగా ఉధృతం చేస్తామని భీశెట్టి బాబ్జీ అన్నారు. ❀

# ఆకాంక్షలు తప్ప ఉద్యోగాలు కల్పించే విధానాలు, నిర్ణయాలు ఏవీ : జేపీ

## నిరుద్యోగంలో రాష్ట్రాలు పోటాపోటీ అని ధ్వజం



ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం 368 ప్యూను పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తే 23 లక్షల మంది దరఖాస్తు చేశారని, వీరిలో లక్షలాది గ్రాడ్యుయేట్లు, వందలమంది పీహెచ్‌డీలు ఉన్నారని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశంలో నానాటికీ తీవ్రతరమవుతున్న ఉద్యోగ సంక్షోభానికి ఇది తాజా నిదర్శనమని, ఉద్యోగాలను కల్పించటంలో అన్ని రాష్ట్రాలూ పోటాపోటీ వైఫల్యం చెందాయని అన్నారు.


ఛత్తీస్‌గఢ్‌లో 30 ప్యూను ఉద్యోగాలకు 75,000 మంది దరఖాస్తులు చేశారని, మనకు కావలసింది నిజమైన, సంపద సృష్టించే ఉద్యోగాలు కాగా, ప్రభుత్వం దృష్టిలో ఉద్యోగాలను సృష్టించటమంటే బంట్రోతు ఉద్యోగాలను భర్తీ చేయటంలా ఉందని జేపీ అన్నారు.

ఎంత ఎక్కువ చదువుకుంటే అంత ఎక్కువ నిరుద్యోగం ఉండటం భారతదేశంలో మాత్రమే కనిపిస్తుందని, మన విద్యావ్యవస్థ, నైపుణ్యాలు, ఆర్థిక విధానాలు, అవినీతి, వ్యాపారాలకి అడ్డంకులు వంటి అనేక విషయాలను సంస్కరించాల్సుండగా పాలకులు ఉపన్యాసాలకే పరిమితం కావటం వల్ల విలువైన కాలం హరించుకుపోతోందని జేపీ అన్నారు. పాఠశాల విద్యలో మనం ప్రపంచంలోనే అట్టడుగు స్థానాల్లో ఉన్నామని ప్రామాణిక సర్వేలు చెబుతుంటే, ఉన్నత విద్యలో ప్రపంచస్థాయి రెండువందల సంస్థల్లో కేవలం రెండు భారతీయ విద్యాసంస్థలే ఉన్నాయని తాజా జాబితా వెల్లడిస్తోందన్నారు.

చైనాలో వేతనాలు పెరగటం, ఇటీవల పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందుల వల్ల అక్కడ్నుంచి భారత్‌కు వచ్చి పడతాయనుకుంటున్న దిగువస్థాయి ఉద్యోగాలు వాటంతటవే రావని, మనం కష్టపడి పనిచేయటంతోపాటు సమూల మార్పుల్ని చేసుకుంటేనే అది సాధ్యమని జేపీ స్పష్టంచేశారు.

యథాతథ స్థితిని కొనసాగిస్తున్న రాజకీయాల తీరు భారత్‌కు శాపంగా మారుతుందన్నారు. "భారత్‌కు సత్తా ఉంది, అవకాశమూ ఉంది. కానీ హేతుబద్ధ విధానాలు, ఆచరణాత్మక నిర్ణయాల వల్ల అభివృద్ధి, ఉద్యోగాలు వస్తాయి తప్ప ఆకాంక్షల వల్లింపు వల్ల కాదు" అని జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటనలో అన్నారు. ❀

# ఎన్నికలు @ లింకన్



అమెరికా అధ్యక్ష ఎన్నికలు మళ్లీ సమీపిస్తున్నాయి. యూఎస్ అధ్యక్ష ఎన్నికలలో చట్టబద్ధంగానే అయినా కళ్లు బైర్లు కమ్మేంత సొమ్ము ఖర్చు చేస్తారన్నది ఆరోపణ. కానీ 2014 ఎన్నికలలో అమెరికా కూడా దిగ్భ్రమ చెందేలా మన తెలుగు రాష్ట్రాలలో చట్టవిరుద్ధంగా వేలకోట్ల రూపాయలు ఖర్చు చేశారని బైటపడ్డాక ఇక అమెరికావాళ్లనేమి తప్పుపట్టగలం? ఇంతా చేసి మనం ఎన్నుకున్న నేతలు ఏం సాధిస్తున్నారంటే, తలదించుకుంటున్నాం. ఈ నేపథ్యంలో మనకూ్కడా పనికొచ్చే మాటల్ని రానున్న అమెరికా ఎన్నికల సందర్భంగా డేవిడ్ బ్రూక్స్ అనే రాజకీయ పరిశీలకుడు ఇటీవల 'న్యూయార్క్ టైమ్స్' పత్రికలో రాశారు. బ్రూక్స్ ఏమంటారంటే:

అమెరికా అధ్యక్ష ఎన్నికలప్పుడు నేను రెండు సంప్రదాయాల్ని పాటిస్తాను. అబ్రహాం లింకన్‌పై పుస్తకాన్ని చదవటంతో ఎన్నికల ప్రచార కవరేజీని ప్రారంభిస్తాను. లింకన్ మెమోరియల్ సందర్శనతో ఎన్నికల ముగింపు కవరేజీని పూర్తిచేస్తాను.

లింకన్ పుస్తకంతో ఎందుకు కవరేజీ ప్రారంభిస్తానంటే, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులలో లింకన్ స్థాయి ప్రమాణాలుంటాయని కాదు. కానీ, అభ్యర్థులలో ఎలాంటి లక్షణాలు ఉండాలన్న విషయంపై లింకన్ మనలో ఒక అవగాహన కలిగిస్తారు. మనం ఓటు వేయాలనుకుంటున్న అభ్యర్థిలో లింకన్ స్థాయి ప్రమాణాలు పూర్తిగా లేకపోయినా కొంతమేరైనా ఉండితీరాలి. మనం ఓటు వేయబోయే అభ్యర్థిలో లింకన్‌కున్న మౌలిక దార్శనికత, సానుకూల దృక్పథం, చుట్టూ ఉన్న రాజకీయ పరిస్థితులకనుగుణమైన సునిశిత వ్యూహచాతుర్యం కలగలిసి ఉండాలి.

రక్తపాత యుద్ధంలో మునిగితేలినా లింకన్ ఎన్నడూ ద్వేషభావాల్ని మనసులోకి చొరబడనీయలేదు. ఎంత మమేకమై చేసే పని నుంచైనా, అవసరమైతే వెనకడుగు వేయగల సామర్థ్యం ఆయనకుండేది. తాను మనసావాచాకర్మణా నమ్మిన విషయంలోనైనా ప్రత్యర్థి భావాల్ని గుర్తించగలిగే శక్తి లింకన్‌లో ఉండేది. తన శక్తిసామర్థ్యాల మీద లింకన్‌కి ఎంత నమ్మకముండేదో, తన చేతుల్లో లేకుండా ఉండే నిస్సహాయ సందర్భాల మీద కూడా ఆయనకు అంతే అవగాహన ఉండేది. అసాధారణ ఆత్మవిశ్వాసం, అదేస్థాయి వినమ్రత లింకన్ సొత్తు. లింకన్ లక్షణాలకు విరుద్ధంగా, తాము పట్టిన కుందేలుకు మూడేకాళ్లు అని వాదించే ఏకపక్ష భావజాల నేతలు ప్రజలకు చాలా ప్రమాదకరం.

... ఇలా ఎన్నికలలో ఓటు సవ్యంగా ఎలా, ఎందుకు వేయాలో అబ్రహాం లింకన్ ప్రమాణాలు గీటురాళ్లుగా డేవిడ్ బ్రూక్స్ చెప్పిన విషయాలు అమెరికన్లకే కాదు మనకూ్కడా ఎంతో విలువైనవని వేరే చెప్పనక్కర్లేదు. మనం ఎన్నుకుంటున్న నేతల్ని చూస్తే చాలు అర్థమవుతుంది.

అమెరికాలో లింకన్ లాంటి వాళ్లు ఇప్పుడు ఎన్నికయ్యే పరిస్థితి ఉందని నమ్మకం లేకపోయినా మార్పు కోసం బ్రూక్స్ తన వంతు ప్రయత్నం చేస్తున్నారు.

యూఎస్‌లో ఇప్పుడున్న పరిస్థితుల్లో లింకన్‌లాంటి వారు ఎన్నికవటం సాధ్యం కాదుగానీ, కనీసం ఆ ఏదోకమేర లింకన్ ప్రమాణాలున్నవారిని ఎన్నుకోవటం ద్వారా నష్టాన్ని కొంతైనా భర్తీ చేసుకోగలమన్నది బ్రూక్స్ అభిప్రాయం. మనదేశంలో ఈ

# హైకోర్టు విభజన కన్నా ప్రజలకు స్థానిక కోర్టుల ఏర్పాటు ముఖ్యం: లోక్‌సత్తా

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలకూ వేర్వేరు హైకోర్టులు ఉండాలన్న డిమాండ్‌కు లోక్‌సత్తా పార్టీ పూర్తి మద్దతునిస్తోందని, అయితే హైకోర్టు కన్నా స్థానిక కోర్టుల ఏర్పాటు ప్రజలకు ఎక్కువ అవసరమని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హైమా పోతినేని అన్నారు. తక్కువ ఖర్చుతో, విధానపరమైన గందరగోళం లేకుండా, కేవలం కొన్ని నెలల వ్యవధిలో ప్రజలకు న్యాయం అందించటానికి అవసరమైన స్థానిక కోర్టుల ఏర్పాటుకు 'గ్రామన్యాయాలయాల చట్టం' 2009లో దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిందని, మౌలిక వసతుల వ్యయాన్ని కేంద్రమే భరించే ఏర్పాటున్నా, రెండు రాష్ట్రాలు ఏర్పాటయ్యాక కూడా తెలుగునాట ఒక్క స్థానిక కోర్టూ ఏర్పాటు కాలేదని విమర్శించారు. కోర్టుల్లో లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వ్యాజ్యాల భారాన్ని భరించలేక కోర్టు దాకా రానివారు ఇంకొన్ని లక్షల్లో ఉంటారని అన్నారు. న్యాయభారాన్ని భరించలేనివారు మధ్యలోనే సెటిల్‌మెంట్లు చేసుకుంటూ గూండాలబారిన పడుతున్నారన్నారు. రాజకీయాల్లో నేరచరితులు పెరగటానికి ఈరకంగా న్యాయవ్యవస్థ అందరికీ అందుబాటులో లేకపోవటం కూడా కారణమన్నారు. ఈ నేపథ్యంలో, ప్రజలకు హైకోర్టు విభజన కన్నా స్థానిక న్యాయస్థానాల ఏర్పాటు ముఖ్యమన్నారు.

మండలానికో స్థానిక న్యాయస్థానం ఏర్పాటు చేయవచ్చని, చిన్నపాటి మార్పులతో పట్టణ ప్రాంతాలలో కూడా వాటిని ఏర్పాటు చేసుకోవచ్చని హైమా అన్నారు. సాధారణ స్థాయి సివిల్, క్రిమినల్ కేసులను స్థానిక భాషలోనే విచారణ చేసి గరిష్ఠంగా ఆరు నెలల్లోగా పరిష్కరించవచ్చన్నారు. పక్కా భవనాల్ని నిర్మించేలోగా కమ్యూనిటీ హాళ్లలో ఈ కోర్టుల్ని ప్రారంభించవచ్చని అన్నారు. వేధింపుల దశలోనే మహిళలపై కేసుల్ని వేగంగా విచారించి పరిష్కరించటానికి స్థానిక కోర్టులు ఎంతో ప్రభావవంతంగా ఉపయోగపడతాయని, దీనివల్ల మహిళలపై అత్యాచారాల్ని గణనీయంగా అరికట్టవచ్చని అన్నారు. ఈవ్‌టీజింగ్ ఎక్కువగా ఉన్న హైదరాబాద్‌లో 20 దాకా స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేస్తే మహిళలపై వేధింపులకు, అత్యాచారాలకు కళ్లెం పడుతుందన్నారు. కాబట్టి, హైకోర్టు విభజన కోసం ఆగకుండా ప్రజలకు ఎక్కువగా ఉపయోగపడే స్థానిక కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకోవాలని, న్యాయవాదులు, ఇతర వర్గాలు మద్దతివ్వాలని హైమా పోతినేని విజ్ఞప్తి చేశారు.

(సామాన్యులకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో న్యాయం అందించే స్థానిక న్యాయస్థానాల ఏర్పాటుకోసం 18ఏళ్ల క్రితం ఉద్యమం మొదలుపెట్టిననాటి నుంచే లోక్‌సత్తా కృషి ప్రారంభించింది. 2003లో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ రూపొందించిన స్థానిక కోర్టుల బిల్లు జాతీయ సలహామండలి ద్వారా 2005లో కేంద్ర కేబినెట్ ఆమోదానికి వెళ్లింది, 2009లో గ్రామన్యాయాలయాల చట్టంగా వచ్చింది. స్థానిక కోర్టుల్ని వెంటనే ఏర్పాటు చేయాలని కూకట్‌పల్లి శాసనసభ్యునిగా జేపీ పలుమార్లు అసెంబ్లీలో డిమాండ్ చేశారు) ❁

---

మాత్రం కూడా ఆలోచించకుండా మహాత్మాగాంధీ నిలబడినా ఓడిస్తామని ఢంకా బజాయించి రుజువుచేస్తున్నాం. మన వేళ్లతో మన కళ్లనే పొడుచుకుంటున్నాం. నిజాయతీపరులు, సమర్థులు ఎన్నికయ్యే వ్యవస్థను తయారుచేసుకోవటం, అలాంటివారికే ఓటు వేయటం ఈవేళ అమెరికా వంటి దేశాలకు కూడా సవాలుగా ఉందిగానీ, వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఊరిస్తున్న భారత్‌కు మాత్రం అది పెనుసవాలు. రాజకీయాల్ని సంస్కరించుకోవటం భారత్‌కు ఇప్పుడు చారిత్రక అవసరం.

ఇక కొసమెరుపు ఏమిటంటే, 2014 ఎన్నికలలో భారత్‌కు ఓ డొనాల్డ్ ట్రంప్ ప్రధానిగా ఎన్నికయ్యారని, 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ తరపున డొనాల్డ్ ట్రంప్ గనక ఎన్నికైతే అమెరికాకు ఓ నరేంద్ర మోదీ ఎన్నికైనట్టవుతుందని విశ్లేషణలు షికారు చేస్తున్నాయి. సరకు కంటే సౌండ్ ఎక్కువ నేతగా పేరుగాంచిన ట్రంప్.. మీడియా కవరేజీ, ప్రత్యర్థులపై విమర్శల దాడి, కీలకాంశాలపై మాట్లాడకుండా తప్పించుకోవటం తదితర అంశాలలో మోదీ తరహాలోనే వ్యవహరిస్తారని చెబుతున్నారు. 2014 ఎన్నికలప్పుడు మార్చి, ఏప్రిల్ నెలల్లో నరేంద్ర మోదీకి జాతీయ ఛానళ్లలో ప్రైమ్ టైంలో అత్యధికస్థాయిలో 33శాతం కవరేజీ రాగా, మొదటి రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డిబేట్ దగ్గర్నుంచీ ఇప్పటివరకూ కవరేజీలో ట్రంప్ ప్రత్యర్థులకన్నా భారీ ముందజలో ఉన్నారని ఉదాహరణలు చూపుతున్నారు. ఏతావాతా, అమెరికా అధ్యక్ష ఎన్నికల తీరుని, ఫలితాల్ని గతంలో కంటే సునిశితంగా పరిశీలించాల్సిన అవసరం భారతీయులకు పెరుగుతోంది. ❁

# 'మార్పు' నియోజకవర్గాల్ని తయారుచేసుకోవాలి

రాజకీయాల ప్రక్షాళనపై 2010 సంవత్సరంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ రాజకీయ ప్రముఖులతో హైదరాబాద్‌లో ఒక బహిరంగ చర్చా కార్యక్రమాన్ని నిర్వహించింది. అందులో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కొణిజేటి రోశయ్య, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, సీపీఐ నుంచి కె. నారాయణ, సీపీఎం నుంచి బి.వి రాఘవులు, లోక్‌సత్తా పార్టీ నుంచి డా॥ జయప్రకాష్ నారాయణ్, ఇంకా కొన్ని పార్టీల నేతలు, పౌరసమాజ ప్రముఖులు హాజరయ్యారు. ఆ సమావేశంలో వ్యవస్థలో మార్పు రావాలంటే ఎన్నికలలో నల్లడబ్బు, మద్యం ప్రవాహం, ఓట్ల కొనుగోలుకు అడ్డుకట్ట వేయటం, ప్రలోభాలు లేకుండా, విద్వేషాలు రెచ్చగొట్టకుండా వ్యవహరించటం తదితర చర్యలపై జేపీ మాట్లాడగా, పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ వల్ల రాజకీయాలు ఎలా డబ్బుమయమై పోయాయో వామపక్ష నేతలు వివరించారు. అప్పుడే ఒక ప్రతిపాదన వచ్చింది. మొత్తం అన్ని నియోజకవర్గాలలో ఇంత నిజాయతీ రాజకీయం చేస్తే ప్రధాన సాంప్రదాయ రాజకీయ పార్టీలు ఓడిపోయే అవకాశాలు ఎక్కువ కాబట్టి, కొన్ని నియోజకవర్గాలలో డబ్బు, మద్యం పంచకుండా ఒక మోడల్‌లాగా 'మార్పు' నియోజకవర్గాలను తయారుచెయ్యాలనే ప్రతిపాదన వచ్చింది. డబ్బు, మద్యం పంచకుండా, అత్యుత్తమ అభ్యర్థికే ప్రజలు ఓటు వేసేలా కొన్ని మోడల్ నియోజకవర్గాలను అభివృద్ధి చేయటానికి చివరికి తెదేపా, కాంగ్రెస్ పార్టీలు అంగీకరించాయి. అప్పటికింకా వైఎస్సార్ కాంగ్రెస్ ఏర్పడలేదు. ఎంతోకొంత మంచి జరిగినా స్వాగతించాల్సిందేనంటూ లోక్‌సత్తా కూడా అందుకు సానుకూలంగా స్పందించింది.

2014లో అలాంటి అవకాశం మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో వచ్చినా మనం జారవిడుచుకున్నాం.

మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో చదువుకున్నవాళ్లు, ప్రలోభాలను అధిగమించగలిగేవారు గణనీయ సంఖ్యలో ఉన్నారు. 34 ఏళ్ల అసాధారణ ప్రజాజీవితం కలిగిన జయప్రకాష్ నారాయణ్ లోక్‌సత్తా తరపున బరిలో ఉన్నారు. కాంగ్రెస్ ఘోరవైఫల్యం నేపథ్యంలో ఆర్థిక పునజ్జీవనం, యువతకు ఏటా 1 కోటి ఉద్యోగాలు, మంచి పాలన, దేశమంతా ఒక్కటే– అనే నాలుగు లక్ష్యాల ప్రాతిపదికన బీజేపీ నేత నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్.డి.ఏని జేపీ సమర్థించారు. తెలుగునాట రెండు రాష్ట్రాలు ఏర్పడుతున్న తరుణంలో రకరకాలపార్టీల మధ్య ప్రజలను రాజకీయంగా గందరగోళ పరచకుండా తెలుగువారి అభివృద్ధికి, దేశ పురోగమనానికి ఒక సరైన ఎజెండాను నిర్దేశించే లక్ష్యంతో బీజేపీతో పొత్తుకు జేపీ ప్రయత్నించారు. అయితే వారు తెలుగుదేశంతో పొత్తునుకుదుర్చుకునే ప్రయత్నంలో ఓట్లు, సీట్లు లెక్కల రాజకీయం మధ్య లోక్‌సత్తాకు గౌరవప్రదమైన స్థానం లభించలేదు. చివరకి, కూటమిలో ఒకరుగా ఉండి మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీచేయాలనుకుని కూడా జేపీ పోటీ చేస్తున్నారు కాబట్టి విరమించుకున్న జనసేన అధ్యక్షుడు, సినీ హీరో పవన్ కళ్యాణ్‌ని కూడా మల్కాజిగిరిలో జేపీ తరపున ప్రచారం చేయకుండా చేశారు. ఎన్.డి.ఏలో భాగస్వామి కాకుండా నరేంద్ర మోడీ పేరుని జేపీ ప్రచారంలో ఎలా వినియోగించుకుంటారని రాజ్యాంగనిర్మాతలే దిగ్భ్రాంతి చెందే వాదనల్ని లేవనెత్తారు.

కూటమి రాజకీయాలతో సంబంధం లేకుండా జేపీ మోడీ నాయకత్వంలోని ఎన్.డి.ఏకి మద్దతు ప్రకటించారు. కూటమికి ఓటు వేయాలా, ఎన్.డి.ఏకి మద్దతిచ్చిన అత్యుత్తమ అభ్యర్థి జేపీకి ఓటు వేయటం మేలా అని తేల్చుకోవాల్సింది ప్రజలు తప్ప పార్టీలు కాదు. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే, ఈ ఓట్లు మావి అనే అధికారం ఏ పార్టీకీ లేదు. ఏ పార్టీకీ ఓటు బ్యాంకులుండవు. వీళ్లు మాకే ఓటు వేయాలి, ఇంకొకరొచ్చి వీళ్లను ఓటు అడగకూడదు అనటం ప్రజాస్వామ్యాన్నే అవమానించటం. తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకునే అధికారం ప్రజలకు ఉంటుంది. ఈ నేపథ్యంలో, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాన్ని మార్పు నియోజకవర్గంగా గుర్తించి ప్రాబల్యమున్న తెలుగుదేశం, కాంగ్రెస్, బీజేపీ, తెరాస వంటి పార్టీలు మంచి అభ్యర్థిని పార్టీలకతీతంగా ఎన్నుకునే స్వేచ్ఛను తమ కార్యకర్తలకు, అభిమానులకు ఇచ్చి ఉంటే బాగుండేది. డబ్బే రాజకీయంగా, అవినీతి పైరవీలే రాజకీయంగా ఉన్న అభ్యర్థులకు బదులు ప్రజల సాధికారత కోసం సుదీర్ఘ కృషి

# రాజకీయ పార్టీలు సమాచార హక్కు పరిధిలోకి రావాల్సిందే: జేపీ

రాజకీయ పార్టీలు వ్యక్తిగత ఆస్తులో, కేవలం సంస్థలో కాదని, ప్రజల రాజకీయ భాగస్వామ్యానికి అవి వేదికలని, కాబట్టి ఖచ్చితంగా సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) పరిధిలోకి రావాల్సిందేనని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

రాజకీయ పార్టీలను ప్రజా సంస్థల పేరుతో సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకురావటం తగదని కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టు ముందు చేసిన వాదనను జేపీ ఖండించారు. పార్టీలన్నీ ఆర్‌టీఐ పరిధిలోకి రావాల్సిందేనని ఎన్నికలకు ముందు వరకు వాదించిన బీజేపీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించటం దారుణమన్నారు. విరాళాల దాతలతోపాటు రాజకీయ పార్టీలకు ఆదాయపు పన్ను నుంచి కూడా నూరు శాతం పన్ను రాయితీ లభిస్తుందని, పార్టీల్ని కుటుంబ ఎస్టేట్లులాగా నడపటం చెల్లదని, ఈ ప్రక్రియంతా ఆర్‌టీఐ పరిధిలోకి రావాల్సుంటుందని జేపీ అన్నారు.

విధానాలను రూపొందించేందుకు, ప్రజాధనాన్ని వ్యయం చేసేందుకు ఓట్లు, అధికారం కోరుతున్న రాజకీయ పార్టీలు ఆర్‌టీఐ పరిధిలోకి రానక్కర్లేదు, ప్రజలకు జవాబుదారుకానక్కర్లేదు అనటం అప్రజాస్వామికమని జేపీ అన్నారు. పార్టీలిచ్చే బంద్‌లు వంటి పిలుపులతో ప్రజాజీవనం స్తంభించిపోయిన సందర్భాలు అనేకమున్నాయని గుర్తుచేశారు.

అన్ని రాజకీయ పార్టీలు అధికారం కోసం పోటీపడాల్సి ఉంటుందని, అయితే ఆ క్రమంలో గుత్తాధిపత్యం చెలాయించటం మాత్రం సాధ్యంకాదని జేపీ స్పష్టంచేశారు. పార్టీల అంతర్గత సమావేశాల్లో చర్చల వివరాలు, అభ్యర్థుల ఎంపికలో వ్యూహాలు తదితరాంశాలు బహిరంగపరచనక్కర్లేదని, అయితే ఆ చర్చల, వ్యూహాల ద్వారా చేసిన విధాన నిర్ణయాలకు, అభ్యర్థుల ఎంపికకు ప్రాతిపదికల్ని, పార్టీల నిధుల పూర్తి వివరాలను మాత్రం ప్రజల ముందు ఉంచాల్సిందేనని అన్నారు. ఈ నేపథ్యంలో, దురుద్దేశంతో సమాచారం కోరే అభ్యర్థనలను తిరస్కరించే కొన్ని ఏర్పాట్లతో రాజకీయ పార్టీలన్నీ సమాచార హక్కు పరిధిలోకి రావాల్సిందేనని జయప్రకాష్ నారాయణ్ స్పష్టంచేశారు. ❁

---

చేసి రెండు తెలుగు రాష్ట్రాలు, హైదరాబాద్ అభివృద్ధికి, దేశ ఆర్థిక పునరుజ్జీవనానికి స్పష్టమైన ఎజెండాతో, రాష్ట్ర విభజన సమయంలో లోక్‌సత్తా రోడ్ మ్యాప్‌తో కేంద్రం నుంచి అన్నిప్రాంతాల తెలుగువారికి సాధించిన హామీల అమలు కోసం పార్లమెంటు పోటీలో ఉన్న జేపీని ఎన్నుకునేందుకు తగిన వాతావరణాన్ని కల్పించి ఉంటే తెలుగువారికి, భారతదేశానికి ఎంతో మేలు జరిగేది.

నిజానికి తెలుగునాట గత కొన్నేళ్ల రాజకీయ సంక్షోభం తర్వాత, రెండు రాష్ట్రాలు ఏర్పడిన తరుణంలో కొంతైనా సమీక్ష చేసుకుని మార్పు దిశగా అన్ని పార్టీలూ ప్రయత్నించాల్సిన తరుణంలో అటువంటి ప్రయత్నమేదీ ప్రాబల్యమున్న పార్టీలలో కనిపించటం లేదు. ఇటు తెలంగాణ, అటు నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తెరాస, తెదేపా పాలన యధాతథ స్థితిని, పేదరికాన్ని కొనసాగించేవిగానే ఉన్నాయి. రెండు రాష్ట్రాలలోని తెలుగు ప్రజల ఆకాంక్షల్ని కనీసం పరిగణలోకి తీసుకోకుండా కేవలం భావోద్వేగాల్ని సంతృప్తి పరిచేలా, మనల్ని ఎన్నుకోవటం తప్ప వీరికి గతిలేదు అనే భావన కలిగించేలా ఆయా పార్టీలు వ్యవహరిస్తున్నాయి. విభజనను ఒక అవకాశంగా మలచటంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలూ ప్రజల ఆశల్ని వమ్ముచేస్తున్నాయి. ప్రజల ఆకాంక్షల్ని అర్థం చేసుకుని వారికి తలెత్తుకుని బతికే జీవితాన్నిద్దామనే సంకల్పం వాటికి ఏ కోశానా కనిపించటం లేదు. తెలంగాణ ఉద్యమానికి, కోస్తా, రాయలసీమ ప్రజల ఆందోళనకి మూలకారణమైన అవినీతి, కేంద్రీకృత పాలన, నిరుద్యోగం వంటి వాటికి సరైన పరిష్కారాల్ని చూపకుండా రుణమాఫీల్ని, తాత్కాలిక తాయిలాల పథకాల్ని పెట్టి కొత్త రాష్ట్రాలకు పురిట్లోనే సంధి కొట్టేలా వ్యవహరిస్తున్నారు. కలగూరగంపలా పాత నాయకులకు కొత్తగా టికెట్లిచ్చారు. ఈ రకంగా ఎన్నికైనవారు 'మార్పు'ని బలవంతంగా అదిమిపడుతున్నారు. దానివల్ల మార్పురావటం ఆలస్యం కావచ్చేమోగానీ ఆగదు. లోక్‌సత్తా ఇందుకోసం సుదీర్ఘ పోరాటం చేస్తోంది. ఆ పోరాటాన్ని వివిధ రాష్ట్రాలకు విస్తరిస్తోంది. అయితే ఈలోగా కొన్నయినా మార్పు నియోజకవర్గాలను ఏర్పాటు చేసుకుంటే రెండు రాష్ట్రాల తెలుగువారికి, ఈదేశ ప్రజాస్వామ్యానికి కొంతైనా మేలు చేసినవారవుతారు. ❁

# లోక్‌పాల్ చట్టాన్ని, అవినీతిపై పోరుని నీరుగార్చే '17 ఎ' ను ఉపసంహరించేలా పార్లమెంటు సభ్యులు పార్టీలకతీతంగా పోరాడాలి: జేపీ

స్థానిక గుమాస్తా నుంచి రాజధానిలోని అత్యున్నత స్థాయి అధికారి దాకా ఏ ప్రభుత్వోద్యోగిపై అవినీతి ఆరోపణలు వచ్చినా దర్యాప్తుకి ముందస్తు అనుమతిని తప్పనిసరి చేసేలా '17 ఎ' సెక్షన్‌ని అవినీతి నిరోధక చట్టంలో చేర్చాలని కేంద్రప్రభుత్వం ప్రతిపాదిస్తోందని, ఈ తప్పుడు నిర్ణయమే అమలైతే సీబీఐ, ఏసీబీలు డమ్మీలుగా మారిపోవటంతోపాటు లోక్‌పాల్ చట్టం, అవినీతిపై పోరాటం నీరుగారిపోతాయని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ హెచ్చరించారు.

ఈ సెక్షన్ వల్ల నేరపరిశోధనాసంస్థలైన సీబీఐ, ఏసీబీ ప్రతి కేసుకూ లోక్‌పాల్/లోకాయుక్త వద్దకు వెళ్లాల్సి ఉంటుందని జేపీ అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 60 లక్షలమంది, చాలా పెద్ద రాష్ట్రాలలో 10 లక్షలకు పైగా, మొత్తంగా దాదాపు 2 కోట్లమంది ప్రభుత్వోద్యోగులున్న మనదేశంలో దీనివల్ల అవినీతిపై దర్యాప్తు దాదాపు స్తంభించిపోతుందన్నారు.

అవినీతి ఆరోపణ కేసుల్లో ప్రాసిక్యూషన్ దశలో లోక్‌పాల్ ముందస్తు అనుమతి సమర్థనీయమని, అయితే దర్యాప్తును మొదలుపెట్టకముందే సీబీఐ, ఏసీబీలు ప్రతి కేసునూ లోక్‌పాల్/ లోకాయుక్త ముందుకు తీసుకెళ్తే, అవినీతి నిరోధక వ్యవస్థ మొత్తం నిర్వీర్యమైపోతుందని జేపీ అన్నారు. పైగా, దర్యాప్తుపై లోక్‌పాల్/ లోకాయుక్త తక్షణ నిర్ణయం తీసుకోవటానికి కూడా ప్రతిపాదిత 17 ఎ అనుమతించదన్నారు. "లోక్‌పాల్ మరియు లోకాయుక్తల చట్టం, 2013లోని 7వ ఛాప్టర్‌కు అనుగుణంగా చేయాలని చెబుతున్న ప్రాథమిక దర్యాప్తునకు కూడా చాలా పెద్ద ప్రక్రియ ఉంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాసేవకుడికి దర్యాప్తులో ప్రాథమిక దశలోనే తన వాదనలు వినిపించే అవకాశం కల్పించాల్సుంటుంది. ఈ తొలిదశ దర్యాప్తు 90 రోజులు లేదా ఇంకా ఎక్కువ కాలం కూడా పట్టచ్చు. ఇలాంటి భారీ తతంగం తర్వాతే అవినీతి ఆరోపణలపై దర్యాప్తునకు అనుమతి లభిస్తుంది" అని జేపీ అన్నారు.

విధినిర్వహణలో భాగంగా పోలీసులు కూడా అవినీతి కేసులు విచారణ చేయకుండా 17 ఎ నిబంధన నిరోధిస్తుందని, అలాగే హత్య, అత్యాచారం, దుర్వినియోగం కేసుల్ని దర్యాప్తు చేసే సాధారణ పోలీసుల స్థాయిలో కూడా అవినీతి కేసులపై సీబీఐ, ఏసీబీలకు విచారణ అధికారం లేకుండా చేస్తుందని జేపీ అన్నారు. 'చట్టం ముందు అందరూ సమానమే, ప్రభుత్వోద్యోగులకు ముందస్తు అనుమతి వంటి రక్షణలు రాజ్యాంగ విరుద్ధమంటూ' సుప్రీంకోర్టు కొట్టివేసిన నిబంధనలను ప్రభుత్వోద్యోగులందరికీ వర్తింపచేయటం వల్ల దర్యాప్తు సంస్థలు తీవ్రంగా బలహీనపడటంతోపాటు లోక్‌పాల్/లోకాయుక్తలు నీరుగారిపోతాయన్నారు. ఉన్నతాధికారుల, నేతల అవినీతిని కట్టడి చేసేందుకు లోక్‌పాల్/లోకాయుక్తలు ఉద్దేశించినవని, ప్రతి అవినీతి కేసునూ దర్యాప్తునకు ముందే వీటి ముందుకు తెస్తే, లోక్‌పాల్/ లోకాయుక్తల మీద మితిమీరిన భారంపడి నత్తనడక నడిచే బ్యూరోక్రసీల్లా అచేతనంగా మారతాయని అన్నారు. చివరకు లోక్‌పాల్ చట్టం లక్ష్యమే దెబ్బతింటుందన్నారు. లోక్‌పాల్, లోకాయుక్తలను 17 ఎ ద్వారా సాధారణ పోలీసు స్టేషన్ స్థాయికి దిగజార్చేస్తున్నారన్నారు.

అవినీతి కేసుల్ని ఛేదించాలంటే, ప్రాథమిక దశలో దర్యాప్తునకు మనకు స్వతంత్ర ప్రతిపత్తిగల బలమైన సీబీఐ, రాష్ట్రాల్లో ఏసీబీలు కావాలని జేపీ స్పష్టంచేశారు. అవినీతి నిరోధక చట్టం, 1988లోని సెక్షన్ 19 (1), సీఆర్‌పీసీ సెక్షన్ 197కింద ఆలస్యం లేకుండా ప్రాసిక్యూషన్‌కు అనుమతినిచ్చి, అటువంటి అధికారాల్ని లోక్‌పాల్/లోకాయుక్తలాంటి స్వతంత్ర ప్రతిపత్తి, నిష్పాక్షికత గల సంస్థల చేతిలో ఉంచాలన్నారు. ఈ ఏర్పాట్లు చేయకుండా, కొత్త 17 ఎ సెక్షన్ ద్వారా ప్రతి కేసునూ దర్యాప్తు అనుమతి కోసం లోక్‌పాల్/లోకాయుక్త వద్దకు తీసుకెళ్లాలంటూ సీబీఐ, ఏసీబీల దర్యాప్తు అధికారాలనే లాగేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రజాసేవకులైన ప్రభుత్వోద్యోగులపై వచ్చే ఏ అవినీతి ఆరోపణపైనైనా ప్రాథమిక దర్యాప్తు చేయటానికి అడుగడుగునా అవరోధాలు కల్పించే ప్రతిపాదిత 17 ఎ సెక్షన్‌పై ప్రజల్లో అవగాహన పెంచి అవినీతి నిరోధక చట్టంలో చేర్చకుండా ఉపసంహరించేలా పార్టీలకతీతంగా పార్లమెంటు సభ్యులు, పౌరసమాజం, మీడియా గట్టిగా పోరాడాలని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. ❀

# లోక్‌సత్తా ఉద్యమం, పార్టీ

భారత రాజకీయ, పాలనావ్యవస్థలలో, పౌరజీవనంలో 1997కి, 2015కి మధ్య మౌలికమార్పుల్ని గమనిస్తే లోక్‌సత్తా ఉద్యమం, పార్టీ కనిపిస్తాయి. ఆగస్టు 3, 1997న డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రారంభించిన లోక్‌సత్తా ఉద్యమానికి ఈ ఏడాదికి 18 ఏళ్లు నిండగా, అక్టోబర్ 2, 2006న ఆవిర్భవించిన పార్టీ ఈవేళ 9వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. లోక్‌సత్తా ఉద్యమానికి, పార్టీకి లక్ష్యాల్లో, మార్గాల్లో తేడా ఉండే అవకాశం లేదు. అందుకే ఉద్యమంగా, పార్టీగా లోక్‌సత్తా ప్రస్థానం గురించి సమీక్షకు, నూతనోత్సాహంతో కార్యోన్ముఖం కావటానికి ఇదో సరైన సందర్భం.

### స్వచ్ఛంద సేవకు విస్తృతార్థం లోక్‌సత్తా ఉద్యమం

స్వచ్ఛంద సంస్థ అంటే ప్రజలకు కొన్ని రంగాలలో సేవల్ని, వసతుల్ని కల్పించటానికి పరిమితమవటం పరిపాటి. కానీ లోక్‌సత్తా అన్ని సమస్యలకూ తల్లివేరు లాంటి, అన్ని సమస్యలకూ ప్రధాన పరిష్కారం కాగల రాజకీయ, పాలనా రంగాల్ని ప్రక్షాళన చేయటానికి నడుం బిగించింది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత అంతటి కృషిని విజయవంతంగా చేసి ఇన్ని సంస్కరణల్ని సాధించిన సంస్థ దాదాపు ప్రపంచంలో కనిపించదు. అమెరికా, బ్రిటన్, సింగపూర్, చైనా వంటి దేశాలలో సంస్కరణలు మంచి మార్పుల్ని తెచ్చినా, ఎన్నో మతాలు, కులాలు, భాషలు, తెగలు ఉన్న భారతదేశంలో ఆ సంస్కరణల్ని తీసుకురావటం మరేదేశంలో కన్నా కష్టమైన పని. అయినా పెద్దసంఖ్యలో యువత, మునుపెన్నడూ లేనంతస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం, ప్రజలలో మార్పు రావాలన్న తపన ఉండటం వల్ల ఇది ఎంత కష్టమైనా కూడా పూర్తిగా ఆచరణసాధ్యమని ప్రజాస్వామ్యానికి గట్టి పునాది వేసే మహాకార్యాన్ని లోక్‌సత్తా చేపట్టింది.

### లోక్‌సత్తా లక్ష్యం

పాలకుల చేతిలో కేంద్రీకృతమైన అధికారాన్ని జనం చేతిలోకి చేర్చి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు 'ప్రజలే ప్రభువులు... పాలకులు సేవకులే' అనే నినాదంతో లోక్‌సత్తా ఆవిర్భవించింది. చిట్టచివరి పౌరునికి కూడా సాధికారతను బదిలీ చేయటం, వ్యవస్థల నిర్మాణంతో పరిరక్షించటం లోక్‌సత్తా లక్ష్యం. ప్రజాస్వామ్యంలో ప్రజల నిర్ణయమే అంతిమం. అయితే వారు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా, ఓటు సక్రమంగా సరైన వ్యక్తికే వేయాలనుకున్నా ఆ అభ్యర్థి ఓడిపోతారనే భయం లేకుండా, అవగాహనతో ఓటు వేసే పరిస్థితుల్ని కల్పించటం, ఎన్నికలు పూర్తయ్యాక కూడా పాలనలో నిరంతరం భాగస్వాములవుతూ యజమానుల్లా ప్రభుత్వ సేవల్ని పొందటం, భవిష్యత్తు తరాలకు తలెత్తుకుని బతికే సమాజాన్ని అందించటం జరిగినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం ఉన్నట్టు, ప్రజలు నిజంగా తమను తాము పరిపాలించుకున్నట్టు. ఈ రకంగా ప్రజల సాధికారత కల్పించేందుకే లోక్‌సత్తా రాజకీయ, పాలనా సంస్కరణల కోసం పోరాడుతోంది.

### ఉద్యమ పద్ధతులు

విప్లవం అంటే రాస్తారోకోలు, మూకుమ్మడి సమ్మెలు, హింసాకాండ కాదని, విప్లవం అంటే చిట్టచివరి పౌరునికి కూడా తన ప్రయోజనం అర్థమై రాజకీయ, పాలనా ప్రక్రియలో భాగస్వామి కావటమని లోక్‌సత్తా భావిస్తుంది. అందుకే వలసపాలకుల మీద ప్రయోగించిన ఆందోళనాపద్ధతుల స్థానంలో రాజ్యాంగాన్ని, చట్టాల్ని, పౌరసత్వాన్ని అస్త్రాలుగా చేసుకుని ఎటువంటి ఆర్భాటాలు, హడావుడి లేకుండా, ప్రజలలో ఆలోచనను పెంచుతూ, సంస్థల బలోపేతం, వ్యవస్థల నిర్మాణంతో వీలున్నంత వరకూ అన్ని పార్టీలు, వర్గాలతో కలిసి పనిచేస్తూ లోక్‌సత్తా తన ఉద్యమ కార్యక్రమాల్ని నిర్వహిస్తుంది.

### లోక్‌సత్తా సాధించిన విజయాలు

దేశానికి స్వాతంత్ర్యం తేవటం కన్నా మనదేశమంతటినీ ఒక తాటి మీదకు తెచ్చి జాతీయతాభావాన్ని తీసుకురావటం మహాత్మాగాంధీ సాధించిన అతి పెద్ద విజయం. వలసపాలనకు వ్యతిరేకంగా శతాబ్దాల పర్యంతం ఛిన్నాభిన్నమై ఉన్న భారతదేశాన్ని ఆయన ఏకం చేశారు గానీ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఆ మహాకార్యాన్ని సాధించే వ్యవస్థల నిర్మాణం మాత్రం చేసుకోలేకపోయాం. వివక్ష లేకుండా ప్రతి బిడ్డా ఎదిగేలా చేసే సంస్కరణల్ని సాధించేందుకు సంకల్పించిన రెండో స్వతంత్ర పోరాటం ఇంకా సంక్లిష్టతలను ఎదుర్కోవలసి వస్తోంది. ఎంతో

ఉదాత్త లక్ష్యంగా ప్రపంచంలోనే అద్భుత డాక్యుమెంట్‌గా గుర్తింపు పొందిన భారత రాజ్యాంగ పీఠికను ఆచరణలో చూపలేక పోతున్నాం. దేశజనాభాలో యువత పెద్దసంఖ్యలో ఉండటం, మునుపెన్నడూ లేని అపార సాంకేతిక పరిజ్ఞానం అనే రెండు గొప్ప అవకాశాలు మార్పునకు మనకు అనుకూలంగా ఉన్నా, అధ్వాన్న విద్యావ్యవస్థ వల్ల దశాబ్దాలుగా వివక్షల చుట్టూ పాతుకుపోయిన మూర్ఖపు సాంప్రదాయ వాదాన్ని ఛేదించటం అంత తేలికకావటం లేదు. ఈ నేపథ్యంలో కూడా లోక్‌సత్తా ఉద్యమం, పార్టీ గణనీయ విజయాలను సాధించాయి.

లోక్‌సత్తా భాష అర్థం కావటం లేదు అనే పరిస్థితి మారి ఇప్పుడు గల్లీ నుంచి ఢిల్లీ దాకా అదే భాష మాట్లాడుతున్నారు. మంచి రాజకీయాలను మించిన పవిత్ర వ్యాసంగం, పరిష్కారం లేదు అని అంగీకరించే వారి సంఖ్య పెరుగుతోంది. రాజకీయాలను ద్వేషించినవారు కూడా రాజకీయాలను మార్పునకు వేదికగా మార్చుకుంటున్నారు. ఓటు వేయటం నామోషీ అనుకున్నవారు కూడా ఇప్పుడు ఓటు వేశానని సెల్ఫీ తీసుకుని మరీ గర్వంగా ప్రదర్శిస్తున్నారు. ప్రశ్నించటం, అవినీతికి వ్యతిరేకంగా పోరాడటం, నేరచరితులను తిరస్కరించటం, విద్య, ఆరోగ్యం గురించి చర్చించటం ఇవన్నీ లోక్‌సత్తా నిర్విరామ కృషి నుంచి వచ్చిన పరిణామాలే.

దేశచరిత్రలో ఎన్నడూ చూడని సంస్కరణలను అధికారం లేకుండా కూడా గత 18 ఏళ్లలో లోక్‌సత్తా సాధించి చూపింది. వాటిలో కొన్ని కీలకమయినవి: (1) పెట్రోలు బంకుల్లో తూనికల మోసాన్ని చాలావరకు అరికట్టటం (2) ఓటర్ల జాబితాల ప్రక్షాళన (3) అభ్యర్థుల నేరచరితని, ఇతర వివరాలని ప్రకటించే చట్టం (2003) (4) పార్టీల విరాళాలలో పారదర్శకతని తెచ్చే చట్టం (2003) (5) పరోక్ష పన్నుల (సెంట్రల్ ఎక్సయిజ్, కస్టమ్స్) సేకరణలో కీలక సవరణలు (6) పార్టీ ఫిరాయింపు నిషేధాన్ని బలోపేతం చేసే రాజ్యాంగ సవరణ (91వ సవరణ) (7) మంత్రివర్గ సభ్యుల సంఖ్యని కుదించే ఏర్పాట్లు (91వ సవరణ) (8) పాలనా సమాచార హక్కు చట్టం (2005) (9) జాతీయ ఆరోగ్య మిషన్ (2005) (10) స్థానిక న్యాయాలయాల చట్టం (2009) (11) సహకార సంఘాల స్వయంప్రతిపత్తి (97వ రాజ్యాంగ సవరణ – 2012) (12) 2 జీ – స్పెక్ట్రం లైసెన్సుల రద్దు – సహజ వనరుల వేలం పాట విధానం (2013) (13) లోక్‌పాల్ చట్టం (2014) (14) ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం జాతీయ జ్యుడీషియల్ నియామకాల కమిషన్ (శ్రీఅజ్ఞా – 2014). ఇప్పుడు విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలు, చట్టబద్ధమైన పాలన, న్యాయవ్యవస్థ – పోలీసు సంస్కరణలు, ప్రభుత్వ సేవలు సకాలంలో అందే చట్టం, రాజకీయ సంస్కరణలు – ఈ రంగాలలో మరిన్ని మౌలిక మార్పుల కోసం లోక్‌సత్తా కృషిచేస్తోంది. ఒక శాంతియుత, ప్రజాస్వామ్య భావవిప్లవం ఏ ఆర్భాటం లేకుండా, రాజ్యాంగ పరిధిలో చట్టబద్ధంగా వివిధ రూపాలలో పోరాడుతూ, ఏ అధికారం లేకుండా ఇన్ని విజయాలను సాధించటం ప్రపంచ చరిత్రలోనే అరుదు. గత 70 ఏళ్లలో ఇన్ని ఫలితాలని సాధించిన ఏకైక ఉద్యమం, పార్టీ – లోక్‌సత్తా.

లోక్‌సత్తా ఉద్యమం ఇంతగా వేళ్లూనుకున్నాక కూడా రాజకీయ అవినీతి వంటి కొన్ని సమస్యలు గతంలో కంటే భయంకర రూపం దాల్చాయి. అధికార యంత్రాంగం నుంచి ప్రజలకు వేధింపులు, లంచాలు కొన్ని చోట్ల వికృత రూపం దాల్చాయి. అయితే వాటిని ఎదుర్కోగలిగే విధానాలు, ఆలోచనా సామర్థ్యం ఉన్నవారి సంఖ్య మాత్రం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా యువతలో. దాదాపు 2లక్షల మందికి ఇప్పటివరకూ లోక్‌సత్తా ప్రత్యక్షంగా భావజాల శిక్షణను అందించింది. ఇంకా లోతైన శిక్షణతో దేశవ్యాప్తంగా నూతన భారతదేశ నిర్మాణం చేయగల నాయకులను తయారుచేసేందుకు ప్రయత్నిస్తోంది.

**ప్రజాస్వామ్యం బలోపేతమై ప్రతి పౌరుడూ సాధికారతతో తలెత్తుకుని బతికేందుకు, ఎదిగేందుకు లోక్‌సత్తా ముఖ్యంగా ఐదు కోణాలలో సంస్కరణల కోసం పనిచేస్తున్నోంది:**

**1. స్వేచ్ఛ :** వ్యక్తి స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణం. భావ ప్రకటన హక్కు, ఎక్కడైనా నివశించే హక్కు, మత స్వేచ్ఛ, వృత్తి స్వేచ్ఛ ఇందులో భాగాలు. కానీ వ్యక్తి స్వేచ్ఛను అనేక రూపాలలో హరిస్తున్నారు.

**2. స్వయంపాలన :** ప్రజాస్వామ్యంలో పౌరులకు తమని తాము ప్రత్యక్షంగా లేదా పరోక్ష ప్రాతినిధ్య పద్ధతిలో పాలించుకునే హక్కు ఉంది. కానీ మన ఎన్నికల వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండటం వల్ల ఎన్నికల్లో డబ్బు, కండబలం, కులం, ప్రాంతం, మతం చొరబడి ప్రజలను కేవలం ఓటు వేసే యంత్రాలుగా మార్చేశాయి.

**3. ప్రజల భాగస్వామ్యాధికారం :** పాలనలో పౌరులకు నిరంతర భాగస్వామ్యం ఉండాలి. కానీ కేంద్రీకృత పాలన వల్ల

పౌరుల ప్రమేయం లేకుండా నిర్ణయాలు జరుగుతున్నాయి. పరిపాలన వికృత రూపం దాల్చి ప్రజాస్వామ్య ఫలితాలు ప్రజలకు అందకుండా చేస్తోంది. దీనికి పరిష్కారమైన వికేంద్రీకరణను అణచివేస్తున్నారు.

**4. చట్టబద్ధ పాలన :** ఎంతటి సంపన్నులైనా, ప్రజాప్రతినిధులైనా, ఉన్నతాధికారులైనా చట్టం ముందు సామాన్యుడితో సమానం కావాలి. చట్టం ఎవరికైనా ఒకటే కావాలి. కానీ ప్రస్తుతం డబ్బు, అధికారం, ఉన్నవాడికో న్యాయం, లేనివాడికో న్యాయం నడుస్తోంది.

**5. స్వయం దిద్దుబాటు :** రాజ్య వ్యవస్థలో స్వయందిద్దుబాటుకి, స్వయంపరివర్తనకి తగిన వ్యవస్థ ఉండాలి. మన పాలనా వ్యవస్థ భయంకరమైన ఉపద్రవాలు వచ్చినప్పుడు తాత్కాలికంగా స్పందించటం తప్ప, ముందుచూపుని, స్వయంపరివర్తనా శక్తిని కోల్పోయింది.

మొత్తం మీద ప్రజాస్వామ్య ఫలితాలను ప్రజలకు అందించాల్సిన వ్యవస్థలు పూర్తిస్థాయిలో పనిచెయ్యటం లేదు. వీటిని చక్కదిద్ది ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలను ప్రభువులుగా చేసి పాలకులను సేవకులుగా మార్చి జన రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థను నిర్మించటమే లోక్‌సత్తా ప్రధాన లక్ష్యం.

**డా॥ జయప్రకాష్ నారాయణ్:** THE LEADER for PEOPLE POWER (Life & Mission)

## భారత్‌లో సమూల రాజకీయ, పాలనా సంస్కరణలకు నాంది జేపీ

జనం జీవితాల్ని విప్లవాత్మకంగా మార్చే కొత్త రాజకీయానికి భారతదేశంలో పునాది వేసిన సమూల సంస్కర్త డాక్టర్ లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ (జేపీ).

స్వాతంత్ర్యపోరాట స్ఫూర్తి ఇంకా కొనసాగుతున్న రోజులవి... 1956, జనవరి 14న కృష్ణాజిల్లా విజయవాడలో సెంట్ ఏన్స్ ఆసుపత్రిలో ఓ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో నాగభైరవ జయప్రకాష్ నారాయణ్ జన్మించారు. తల్లిదండ్రులు బాల కోటమ్మ, వెంకటేశ్వరరావు. గొడవర్రు గ్రామంలో చదువు అనంతరం జయప్రకాష్ నారాయణ్ విజయవాడ లయోలా కాలేజీలో చేరారు. తర్వాత 1972లో గుంటూరు మెడికల్ కాలేజీలో చేరారు. దేశ రాజకీయాల్నేగాక యువ జయప్రకాష్ జీవితాన్ని కూడా మలుపు తిప్పిన సంవత్సరాలవి. చాలామంది విద్యావంతులైన యాంగ్రీ యంగ్‌మెన్‌లాగే జయప్రకాష్ మనసు కూడా వ్యవస్థలోని దోపిడీ పట్ల ఉడికి పోయింది. అయితే మిగిలినవారిలోలాగా అది పైపైన ఉద్రేకంలా ఆయనలో చల్లారలేదు. ఎందుకీ అన్యాయం? దీనికి పరిష్కారం లేదా? ఇందుకోసమేనా మనం స్వాతంత్ర్యం తెచ్చుకున్నది? అని మథనపడుతుండేవారు. నిజాయితీ, నిర్భీతితో నిండివుండడంతో ఆయన భావాలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసేవి. దేశ సామాజిక, రాజకీయాంశాలపై జరిగే అంతర్ కళాశాలల చర్చా పోటీల్లో ఆయనే ఎప్పుడూ విజేత.

జయప్రకాష్ మనసులో ఉన్న తిరుగుబాటు భావాలు ఎమర్జెన్సీ సమయంలో ఇంకా పదునెక్కాయి. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా విప్లవం నడిపి ఇందిరాగాంధీని గద్దెదించిన లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ పేరునే తల్లిదండ్రులు ఆయనకు పెట్టటం యాధృచ్ఛికం. జనతా ప్రభుత్వం అంత: కలహాలతో పతనమవుతున్న నేపథ్యంలో వ్యవస్థలో మార్పు కోసం ఏదోఒకటి చేయాలని బలంగా భావిస్తున్న క్రమంలో ఆయన సివిల్ సర్వీసెస్ వైపు దృష్టి మళ్లించారు. టాపర్‌గా 1980లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్)లో చేరారు. మంచిని మంచిగా, చెడును చెడుగా చూడగల నిష్పాక్షికత, ప్రజల విజ్ఞత పట్ల చెదరని విశ్వాసం ఆయనను సాహసోపేతంగా మహాకార్యాల దిశగా ప్రేరేపించాయి, రోల్‌మోడల్‌గా నిలిపాయి, జనరాజకీయవేత్తగా మలిచాయి.

## అసమాన సేవలు

తన పదహారేళ్ల ఐఏఎస్ కెరీర్‌లో జయప్రకాష్ నారాయణ్ నభూతో అనే రీతిలో అనేక విజయాల్ని చవిచూశారు. జేపీగా ప్రజల్లో చిరపరిచితులయ్యారు. జాయింట్ కలెక్టర్ నుంచి ముఖ్యమంత్రి, గవర్నర్ కార్యదర్శిదాకా అనేక హోదాల్లో అసమాన నాయకత్వ లక్షణాలతో పనిచేసిన జేపీ ఎక్కడ అడుగుపెట్టినా సంక్షేమం వెల్లివిరిసింది. ఏ పదవిలో ఉన్నా ఎప్పుడైనా సామాన్యులు తనని కలుసుకునే ఏర్పాటుచేసిన తొలి ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ్. ప్రకాశం, తూర్పు గోదావరి జిల్లాల్లో డాక్టర్ జేపీ సాధించిన ఘనత గురించి ఇప్పటికీ అక్కడి రైతులు, సామాన్య ప్రజలు గొప్పగా చెప్పుకుంటారు. ప్రకాశం

జిల్లాలో రైతుల్ని మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల వైపు పెద్దఎత్తున మళ్లించటం ఆయన సాధించిన ఘనవిజయం. ఫలితంగా రెండున్నరేళ్లలో 453 మైనర్ ఇరిగేషన్ పథకాలు, 2800 ఉపరితల బోరుబావులు, 70 మళ్లింపు పథకాలు రూపుదిద్దుకున్నాయి. వీటిలో చాలావరకూ జేపీ హయాంలోనే పూర్తయ్యాయి. వీటివల్ల సుమారు 2,00,000 ఎకరాలకు సాగునీటి సదుపాయం కలిగింది. లక్షకి పైగా రైతుకుటుంబాలు లాభపడ్డాయి. దీనికోసం ఖర్చయ్యింది ఎకరాకు రూ.2,000 మాత్రమే. ఇన్నేళ్లయినా ఆనాటి పథకాలు ఇప్పటికీ విజయవంతంగా నడుస్తున్నాయి. సర్ ఆర్థర్ కాటన్ తర్వాత అంత సాధారణ వ్యయంతో అంత పెద్దఎత్తున సాగునీటి సౌకర్యం కలిగించిన వ్యక్తి భారతదేశంలో ఇంకొకరు లేరు. అలాగే ఎన్నో వ్యయప్రయాసలకోర్చి జేపీ గోదావరి డెల్టాలో మురుగుకాల్వ వ్యవస్థను ప్రక్షాళన కార్యక్రమం చేపట్టారు. తర్వాత తుపాను పునర్నిర్మాణ పథకంగా ఇది పెద్దఎత్తున విజయవంతమైంది.

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగాలిప్పించటం జేపీ కెరీర్‌లో మరో చెప్పుకోదగిన ప్రజాసంక్షేమ విజయం. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం వల్ల స్థలాలు కోల్పోయినవారికి ఆయన జీవన భద్రతతో కూడిన పునరావాసం కల్పించారు. ఇళ్లు, ప్లాంట్‌లో ఉద్యోగాలు అందేలా చూశారు.

రాత్రింబవళ్లు శ్రమించి, ప్రభుత్వంలో గుమస్తా దగ్గర్నుంచి ముఖ్యమంత్రి దాకా అందర్నీ స్వయంగా ఒప్పించి 8000మంది యువతకు సంవత్సరకాలం ప్రత్యేక శిక్షణను జేపీ అందించారు. కేవలం ఆయన పట్టుదలే వేల కుటుంబాలకు అక్కడ శాశ్వత జీవనోపాధినిచ్చింది.

కాకినాడ పోర్టు ప్రాంతం అభివృద్ధి, రుణ సహకార రంగ పునరుద్ధరణ, సభ్యులకే పూర్తి అధికారాన్నిచ్చే 1995నాటి 'మ్యాక్స్' సహకార చట్టం, హైదరాబాద్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్కు అభివృద్ధి, పోర్టు నగరాల అభివృద్ధి, విద్యుత్‌రంగ సంస్కరణకు కొత్త విధానాన్ని రూపొందించటం, ఎంటర్‌ప్రెన్యూర్‌లకు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ల సారథ్యం, సాగునీటి యాజమాన్యంలో రైతు లను భాగస్వాములను చేయటం, ప్రభుత్వరంగ సంస్థల పునర్ని ర్మాణం, పాఠశాలల నిర్వహణలో తల్లిదండ్రుల సాధికారికతకు చట్టం చేయటం వంటివి తన ప్రభుత్వ సర్వీసులో జేపీ సాధించిన కొన్ని గణనీయ విజయాలు. జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్, రాష్ట్ర సహకార బ్యాంకు, పారిశ్రామిక మౌలికవసతుల సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా, గవర్నర్, ముఖ్యమంత్రికి కార్యదర్శిగా వివిధ హోదాల్లో ఆయన సేవలందించారు.

### పదవీ త్యాగం

జేపీ రాజీనామా ప్రకటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. వ్యవస్థలో మార్పు కోసం అంత పెద్ద ఉద్యోగాన్ని, సుఖ మయ జీవితాన్ని వదిలేసి రావటమా అని సర్వత్రా చర్చ జరిగింది. ఈ కాలంలో కూడా ఇలాంటి త్యాగాలు ఉంటాయా అని విస్తుపోయారు. కొందరిలో అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. అయితే ఇలాంటి సందర్భం ఒకటి తన జీవితంలో ఎప్పుడోకప్పుడు తప్పదు అని జేపీ 1983లోనే అనుకున్నారని తెలుసుకున్నాక వారి సంభ్రమాశ్చర్యాలు, అనుమానాలు ఆరాధనగా మారాయి. 'ఐఏఎస్ నా లక్ష్యం కాదు. ఏ క్షణానైనా నా ఉద్యోగానికి రాజీనామా చేయవచ్చు' అని పెళ్లికి ముందు జేపీ తనతో చెప్పారని, అందుకు సిద్ధపడే ఆయన్ను వివాహం చేసుకున్నానని ఆయన సతీమణి రాధ పలుసందర్భాల్లో చెప్పారు. భారత రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో మౌలిక ప్రజాస్వామ్య సంస్కరణలు తెచ్చి పుట్టుకతో వివక్షలేని సమాజాన్ని సృష్టించాలనే తన నిరంతర స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు 1996లో ఐ.ఏ.ఎస్‌కి రాజీనామా చేసి లోక్‌సత్తా ఉద్యమాన్ని ప్రారంభించారు. అచిరకాలంలోనే లోక్‌సత్తా భారతదేశంలో ప్రజాస్వామ్య సంస్కరణల కోసం జరుగుతున్న అపూర్వ ప్రజాఉద్యమంగా రూపుదిద్దుకుంది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఇంత పెద్ద పరిధి గల పౌర ఉద్యమం, ఈ స్థాయి విజయాలు ఎక్కడా లేవు. వెల కట్టలేని లోక్‌సత్తా కృషి వల్ల ఇప్పటికే కొన్ని పదుల వేల కోట్లు ప్రత్యక్షంగా, లక్షల కోట్లు పరోక్షంగా ఈ దేశానికి ఆర్థిక లబ్ధి చేకూరింది.

ప్రపంచ దేశాల అనుభవాలన్నిటినీ అధ్యయనం చేసి భారతదేశ పరిస్థితులకనుగుణంగా ఒక నూతన దార్శనికతను డా॥ జేపీ అందించారు. ఈ మహాకార్యం మరేదేశంలోనూ ఇంత సంక్లిష్టంగా ఉండదని తెలిసినా ఆ భారాన్ని తలకెత్తుకున్నారు. జేపీలాగా తన భావజాలాన్ని తానే రూపొందించుకుని, దాన్ని సాధించేందుకు స్వయంగా సుదీర్ఘకాలం క్షేత్రస్థాయిలో పూర్తిసమయం పనిచేసిన నాయకులు ప్రపంచ చరిత్రలోనే బహు

అరుదు. ఆర్భాటాలు లేకుండా దేశం నలుమూలలా జేపీ వేలాది సభలలో పాల్గొని, తలెత్తుకుని బతికే కొత్త రాజకీయంపై, విధానాలపై ప్రజలలో చైతన్యాన్ని, అవగాహనను పెంచారు. కొత్తతరం కోసం కొత్త రాజకీయానికి వేదికగా ఉండటం కోసం గాంధీజయంతి రోజున అక్టోబర్ 2, 2006న లోక్‌సత్తా పార్టీని జేపీ స్థాపించారు. స్వతంత్ర భారత రాజకీయాలలో సానుకూల దృక్పథం, ఆధునికత, ఉదార విలువలు, దీర్ఘకాలిక దృష్టి, పార్టీల ప్రజాస్వామికీకరణ, సమర్థత, నిబద్ధత కలిగిన సామాన్యులు రాజకీయాలలో భాగస్వాములవటం, పార్టీలకతీతంగా దేశం కోసం పనిచేయటం వంటివి వేళ్లూనుకోవటం జేపీ రాకతోనే మొదలయ్యాయి.

ఆటగాళ్లు కాదు ఆటనియమాలు మారాలి, మంచి రాజకీయాల్ని మించిన పవిత్ర వ్యాసంగం మనిషి జీవితంలో లేదు, నాణ్యమైన విద్యను రాజకీయానికి కేంద్రబిందువు చేయాలి వంటి లోక్‌సత్తా భావాల్ని ఇప్పుడిప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నుంచి పలువురు రాజకీయ నేతలు, పౌరసమాజ సంస్థలు, ఆలోచనాపరులు మాట్లాడుతున్నారు. సినిమాలలో కూడా వల్లిస్తున్నారు. లోక్‌సత్తా స్ఫూర్తితో కొత్త రాజకీయం పార్టీలు కూడా వస్తున్నాయి. ఇది దేశ భవిష్యత్తుకి అవసరమైన చాలా కీలక పరిణామం. మంచి రాజకీయంలో భాగస్వాములు కావటం అంటే, ప్రతి ఒక్కరూ ఎన్నికలలో పోటీ చేయాలనో, పార్టీ కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా పాల్గొనాలనో కాదు. మనకున్న ఓటు హక్కు, భావప్రకటనా స్వేచ్ఛను ఉపయోగిస్తూ సభ్యులుగా, వలంటీర్లుగా కొంత సమయం పనిచేస్తూ, మన పరిధిలో మంచి రాజకీయం, పాలన కొనసాగేలా బాధ్యత తీసుకోవటం. అలా మన పరిధిలో మనం, ముఖ్యంగా యువత 'థాట్ లీడర్స్'గా వ్యవహరిస్తే సత్తా గల పౌరులుగా మనం మంచి రాజకీయంలో భాగమైనట్టే. ఇలా ప్రకృతి సూత్రాల ప్రాతిపదికన అన్ని వ్యవస్థలనూ సమన్వయం చేస్తూ ఏ తరంలోని సమస్యల్ని ఆ తరంలోనే పరిష్కరిస్తూ, మనం సుఖసంతోషాలతో సంతృప్తిగా బతికే సమగ్ర భావజాలాన్ని లోక్‌సత్తా అందించబట్టే, లెఫ్ట్, రైట్, ఆస్తిక, నాస్తిక, హిందూ, ముస్లిం, క్రైస్తవ, ఈ కులం, ఆకులం, ఈ ప్రాంతం, ఆ ప్రాంతం, ఈ భాష, ఆ భాష అని తేడా లేకుండా అందరికీ లోక్‌సత్తాలో తాము కలలుగంటున్న లక్ష్యాలు హేతుబద్ధంగా, ఆచరణాత్మకంగా సాధించే విధానాలు, కొత్త రాజకీయ సంస్కృతి ప్రతి అంశంలోనూ కనిపిస్తుంటాయి. ఒకరకంగా చెప్పాలంటే, కాలానుగుణంగా మార్చుకునే వీలున్న కాలాతీత భావజాలం లోక్‌సత్తా. అజరామరమైన లోక్‌సత్తా భావజాలం, విధానాలు, సంస్కృతి మనల్ని నిస్సందేహంగా చరిత్రకు సరైన వైపున నిలుపుతాయి. మీరు దేవుణ్ని నమ్మే వారైతే మీ ఇష్టదైవం ఉండే ఆలయాన్ని వందలసార్లు సందర్శించినదానికంటే కూడా లోక్‌సత్తా భావజాలాన్ని ఆచరణలో పెట్టేందుకు ఒక్కరోజు కృషి చేస్తే ఎంతో పుణ్యఫలాన్ని సాధించుకోగలుగుతారు.

ఒకరికి మేలు జరగాలంటే ఇంకొకరు నష్టపోవాల్సిందే అనే పాత, బూజుపట్టిన 'జీరో సమ్ గేమ్' రాజకీయాల స్థానంలో పరస్పర విరుద్ధమైనవైనా సరే అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయటమే రాజకీయం లక్ష్యమని, పార్టీల కన్నా దేశ ప్రయోజనాలు ముఖ్యమని లోక్‌సత్తా ప్రవేశపెట్టిన కొత్త రాజకీయ దృక్కోణం ఆచార్య కొలకలూరి ఇనాక్ ఓ ఉగాది సందర్భంగా చెప్పిన ఈ కవితను గుర్తుచేస్తుంది:

"... పంచవర్ష, పంచవర్ణ పతాకాలు
సోదరతా సూత్రంతో ఎగరకపోతే
మనిషి నిలిచే చోటెక్కడ?
మనుగడ మిగిలే రోజెప్పుడు?
మనకు తెలియటంలేదు కానీ,
మనం నిశ్శబ్దంగా చరిత్రను నిర్మిస్తున్నామనటం సత్యం.

వైరుధ్యాల సమన్వయ సాధనే సమర్థత.
సమర్థులే చరిత్రను నిర్మిస్తారు
భవిష్యత్తును శాసిస్తారు"

భారత ప్రభుత్వ జాతీయ సలహామండలిలో సభ్యునిగా కూడా జేపీ సేవలందించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే పాలనా సమాచార హక్కు (ఆర్.టి.ఐ) చట్టం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్.ఆర్.హెచ్.ఎం), సహకార సంఘాల బలోపేతానికి 97వ రాజ్యాంగ సవరణ వంటివి సలహా మండలి సభ్యునిగానే జేపీ సాధించారు. భారతదేశ రెండవ పరిపాలనా సంస్కరణల సంఘం సభ్యునిగా కూడా దేశానికి జేపీ ఎనలేని సేవలందించారు. దేశ స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చేందుకు కావలసిన మౌలికమైన పాలనా సంస్కరణలను ఆయన ఈ సంఘంలో సభ్యునిగా రూపొందించారు.

2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు కూకట్‌పల్లి నుంచి జేపీ ఎన్నికయ్యారు. డబ్బు, మద్యం పంచకుండా, ప్రలోభాలు, విద్వేషాలు లేకుండా కొత్త రాజకీయ సంస్కృతితో ఎన్నికై అసెంబ్లీ గౌరవాన్ని పెంచి 'ఆదర్శ శాసనసభ్యునిగా' విస్తృత గుర్తింపును పొందారు. ప్రజాప్రతినిధిగా మైలురాళ్లలాంటి మార్పుల కోసం జేపీ పోరాడారు. పౌరులకు ప్రభుత్వ సేవలు ఒక హక్కుగా అందించేందుకు, అవినీతి నిరోధానికి బలమైన వ్యవస్థలకు, స్థానిక ప్రభుత్వాలకసాధికారతకు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలకు, న్యాయ సంస్కరణలకు, స్వేచ్ఛామార్కెట్‌తో వ్యవసాయ సంస్కరణలకు, నిరుపేదలకసామాజిక భద్రతకు జేపీ లోతైన కృషి కొనసాగించారు. వ్యవస్థలో మార్పు కోసం ప్రతిష్ఠనంతా ఫణంగా పెట్టి ఎన్నికలలో ఓడినా ఫర్వాలేదు అని కొత్త రాజకీయాన్ని ఆచరణలో చూపారు. లక్ష్యాల సాధన కోసం గల్లీ నుంచి ఢిల్లీ దాకా పనిచేస్తున్న జేపీ... స్వచ్ఛమైన రాజకీయాలకు, సుపరిపాలనకు చెరగని చిరునామాగా, దిక్సూచిగా, యువతకు రోల్‌మోడల్‌గా ప్రవాస భారతీయుల్లో సైతం విశేష ప్రాచుర్యం పొందారు. "బేసిక్స్‌ని (మూలాల్ని) ఎన్నడూ మరువకపోవటం, లక్ష్యసాధన కోసం ప్రతిరోజూ పనిచేయటం ఆయన విజయరహస్యాలు".

**భారతదేశాన్ని అగ్రరాజ్యంగా మార్చడానికి 'నేను' బదులు 'మనం' అని ఆలోచించి, ఈ ఏడు జాడ్యాలనూ నిర్మూలిద్దాం ...**

1) పెరుగుతున్న అసమానతలు, యాచక ప్రవృత్తి, నిరుద్యోగం, పేదరికం 2) కులం, మతం, భాష, ప్రాంతం పేరుతో ప్రజల్ని నిరంతరం విభజించే ధోరణి 3) గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అగాధం పెరుగుతూ... గ్రామాలు ఖాళీ అవటానికి, పట్టణాలు, నగరాలు జనాభాతో కిక్కిరిసిపోవటానికి దారితీయటం 4) విశృంఖల అవినీతి 5) అధికారాన్ని విపరీతంగా కేంద్రీకరించి, ప్రజల్ని నిర్వీర్యుల్ని చేయటం 6) చట్టబద్ధ పాలన కొరవడటం 7) మద్యం, మత్తుపదార్థాల వినియోగం

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

**త్యాగాలు అక్కర్లేదు... సమాజం కోసం కాసేపు సమయం ఇవ్వండి లేవండి... పాల్గొనండి... మార్చండి**

జోతిబాఫూలే, నారాయణ గురు, బాబాసాహెబ్ అంబేద్కర్, రామస్వామి నాయకర్ చేపట్టిన సామాజిక ఉద్యమాన్ని కొనసాగించటం, పుట్టుకతో వివక్షలేని సమాజాన్ని సృష్టించటం లోక్‌సత్తా మౌలికలక్ష్యం.

కులంతో, వృత్తితో, సంపదతో, హోదాతో, అధికారంతో మనిషికి ప్రత్యేక గౌరవాన్ని ఆపాదించటం సమాజానికి హానికర మని జేపీ బలంగా వాదిస్తారు. ఈ సంపూర్ణ ప్రజాస్వామిక విప్లవంలో తమ వంతు పాత్ర కోసం లోక్‌సత్తాని ఒక వేదికగా ఉపయోగించుకోవాలని ఆయన కోరుతున్నారు.

"లోక్‌సత్తా భారతదేశంలో మౌలిక మార్పుకి నాంది పలికి అధికారంలో ఉన్నవారు కూడా సాధించలేని ఎన్నో విజయాల్ని సాధించినా అవి చాలవు. లోక్‌సత్తా సాధించిన చట్టాల్ని సక్రమంగా అమలుచేయించటంతోపాటు ఇంకా సాధించాల్సినవి ఉన్నాయి. ఆర్థికాభివృద్ధి, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, కోట్లాది యువతకు ఉద్యోగాలు ఇప్పుడు భారత్ ముందున్న పెనుసవాళ్లు. మరోపక్క మనదేశం ముందున్న అవకాశాలు క్రమంగా పరిమితమైపోతున్నాయి. కాబట్టి చైతన్యవంతులైన ప్రజల భాగస్వామ్యంతో లోక్‌సత్తా సంస్కరణల ఉద్యమాన్ని మరో దశకు వేగంగా తీసుకెళ్లటం అవసరం.

మీరేమీ త్యాగాలు చేయనవసరం లేదు. స్వార్థాన్ని విడిచి పెట్టనక్కర్లేదు. కానీ మీ స్వార్థమేంటో స్పష్టంగా తెలుసుకోండి. మీ సంతోషమయ జీవితానికి, మీ బిడ్డల ఉజ్వల భవిష్యత్తుకు ఎలాంటి వ్యవస్థ కావాలో ఖచ్చితంగా నిర్ధారించుకోండి. అలాంటి మార్పుల కోసం మీ వంతు పాత్ర పోషించండి. లేవండి...పాల్గనండి... ఈ అవినీతి రాజకీయ, పాలనా వ్యవస్థల్ని శాశ్వతంగా మార్చండి... లోక్‌సత్తాతో కలసిరండి.

(www.twitter.com/jp_loksatta, www.facebook.com/jploksatta, info@loksattaparty.com, www.loksatta.org)

అని జయప్రకాష్ నారాయణ్ ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా యువతకి పిలుపునిస్తున్నారు. ❀

# హైదరాబాద్ అభివృద్ధికి అవరోధంగా మారిన ఎమ్మెల్యేల పనితీరు: లోక్‌సత్తా

ఎన్నో ఆకాంక్షలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి హైదరాబాద్ ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారు ఈ పార్టీ, ఆ పార్టీ అని తేడా లేకుండా తొలి ఏడాదిన్నరలోనే ప్రజల ఆశల్ని, నమ్మకాల్ని వమ్ము చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడి ప్రత్యేక ప్రతినిధి, గ్రేటర్ హైదరాబాద్ విభాగం ప్రధాన కార్యదర్శి బొంతు సాంబిరెడ్డి విమర్శించారు. అసెంబ్లీలో వారు ప్రస్తావించిన ప్రజాసమస్యలుగానీ, నియోజకవర్గాలలో వారు చేపడుతున్న అభివృద్ధి పనులుగానీ నమ్మి ఓటువేసిన ప్రజల్ని ఓడించేలా ఉన్నాయన్నారు. హైదరాబాద్ ఎదుర్కొంటున్న కృష్ణా జలాల ఫేజ్ –3, భూకబ్జాలు, పార్కుల ఆక్రమణ, ఆటస్థలాల పరిరక్షణ, అధ్వాన్న పాఠశాలలు, పారిశుధ్యం, డంపింగ్ యార్డులు, అధికార కేంద్రీకరణ, శాంతిభద్రతలు వంటి ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యేలు శాసనసభలో ప్రభుత్వాన్ని నిలదీసింది దాదాపు శూన్యమన్నారు. నియోజకవర్గాలలో ప్రారంభోత్సవాలు, ప్రచార ఈవెంట్లలో తప్ప నియోజకవర్గ నిధుల నుంచి కూడా అభివృద్ధి పనులు చేపట్టటానికి ఎమ్మెల్యేలకు తీరికలేకపోవటం భాగ్యనగరవాసుల దౌర్భాగ్యమన్నారు.

నగర ఎమ్మెల్యేల పనితీరుపై సాంబిరెడ్డి అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కూకట్‌పల్లి శాసనసభ్యునిగా ఉన్న సమయంలో (2009–14) నియోజకవర్గ అభివృద్ధి నిధులు వచ్చిన తొలి ఏడాదే నూరు శాతం ఖర్చు చేశారని, ఐదేళ్లలో అదనంగా నిధులు సాధించి మరీ 160శాతం ఖర్చు చేశారన్నారు. జేపీకి నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ. 5. 5కోట్లు మంజూరుకాగా రూ. 8. 8కోట్లు వ్యయం చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి నెలకొని పరిపాలన స్తంభించినా మొత్తం రూ. 1600 కోట్ల మేర నియోజకవర్గ అభివృద్ధి పనుల్ని పార్టీకి కేవలం ఒక్క శాసనసభ్యునిగా ఉండి కూడా జేపీ చేసి చూపారని, కొత్త రాష్ట్రం ఉత్సాహం నెలకొన్నప్పటికీ ప్రస్తుత సభ్యుల్లో (ఉప ముఖ్యమంత్రి, మంత్రిగా ఉన్న ఇద్దరు ఎమ్మెల్సీలు సహా) చాలామంది తమకు వచ్చిన నియోజకవర్గ అభివృద్ధి నిధుల్లో సగానికి సగం కూడా ఖర్చు చేయలేదని గణాంకసహితంగా వివరించారు. 2014–15కి హైదరాబాద్‌లోని ఎమ్మెల్యేలకు రూ. 24 కోట్ల నియోజకవర్గ



అభివృద్ధి నిధులురాగా, ఇప్పటి వరకూ కేవలం యాభై శాతం లోపు రూ. 11.91 కోట్లకు మాత్రమే ప్రతిపాదనలు పంపారని అన్నారు. పనులు పూర్తవటానికి సమయం పట్టవచ్చుగానీ, కనీసం ప్రతిపాదనలు పంపటానికి కూడా సమయం లేదన్నట్టు ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే నిర్వహించవలసిన ప్రధాన బాధ్యతలైన వివిధ సమస్యలు, చట్టాల మీద స్పందించటం, పరిష్కారాలు చూపించటం, ప్రైవేటు బిల్లులు ప్రవేశపెట్టటం, తనకిచ్చిన నిధులను పూర్తిగా సద్వినియోగం చేయటం, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ రాష్ట్ర, దేశ ప్రయోజనాలను పరిరక్షించటం, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించటంలో జేపీ మొదటిస్థానంలో ఉండి అసెంబ్లీ గౌరవాన్ని పెంచితే ఇప్పుడు చాలామంది నగర ఎమ్మెల్యేల తీరు అందుకు పూర్తి విరుద్ధంగా ఉందన్నారు.

ఒక్కో ఎమ్మెల్యేకి నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఏడాదికి రూ. 1కోటీ 50 లక్షలు. ఇందులో రూ.75 లక్షలు ఎమ్మెల్యే నేరుగా ఇవ్వొచ్చు, మరో రూ.75 లక్షలు ఇంఛార్జి మంత్రితో కలిసి ప్రతిపాదనలు పంపి సాధించుకోవాలి.

రూ. 1కోటీ 50 లక్షల నియోజకవర్గ అభివృద్ధి నిధులుంటే, ఇప్పటివరకూ హైదరాబాద్‌లోని ఒక్కో ఎమ్మెల్యే చేసిన ఖర్చును పార్టీలవారీగా సాంబిరెడ్డి విడుదల చేశారు:

**బీజేపీ ఎమ్మెల్యేలు:**

కిషన్ రెడ్డి (బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు–అంబర్‌పేట): రూ.14.55 లక్షలు ఖర్చు చేశారు.

లక్ష్మణ్ (శాసనసభా పక్ష నాయకుడు–ముషీరాబాద్): రూ.37.94 లక్షలు ఖర్చు చేశారు

చింతల రామచంద్రారెడ్డి (ఖైరతాబాద్): ఖర్చు చేసింది రూ.0 (శూన్యం)

ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ (ఉప్పల్): రూ.74.98 లక్షలు ఖర్చు చేశారు

రాజా సింగ్ (గోషామహల్): రూ.24.24 లక్షలు ఖర్చు చేశారు

**అధికార టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు/ఎమ్మెల్సీలు :**

కనకారెడ్డి (మల్కాజిగిరి): రూ.71.35 లక్షలు ఖర్చు చేశారు

ఎం.సుధీర్ రెడ్డి (మేడ్చల్): రూ.72.92 లక్షలు ఖర్చు చేశారు

మహమూద్ అలీ (ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ): ఖర్చు చేసింది రూ.0 (శూన్యం)

నాయిని నర్సింహారెడ్డి (మంత్రి, ఎమ్మెల్సీ): రూ.60 లక్షలు ఖర్చు చేశారు

స్టీఫెన్‌సన్ (నామినేటెడ్ ఎమ్మెల్యే): రూ. 6 లక్షలు ఖర్చు చేశారు

**తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు:**

ఆరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి): రూ.34.10 లక్షలు ఖర్చు చేశారు

ఆర్.కృష్ణయ్య (ఎల్.బి నగర్): రూ.73.55 లక్షలు ఖర్చు చేశారు

మాగంటి గోపీనాథ్ (జూబ్లీ హిల్స్): రూ.84.50 లక్షలు ఖర్చు చేశారు

**ఎంఐఎం ఎమ్మెల్యేలు:**

అక్బరుద్దీన్ ఒవైసీ (శాసనసభాపక్ష నేత–చాంద్రాయణగుట్ట): రూ.75 లక్షలు ఖర్చు చేశారు

పాషా ఖాద్రి (చార్మినార్): రూ.25 లక్షలు ఖర్చు చేశారు

ముంతాజ్ అహ్మద్ ఖాన్ (యాకత్‌పురా): రూ.70 లక్షలు ఖర్చు చేశారు

మహ్మద్ మొయిజ్ ఖాన్ (బహదూర్‌పురా): రూ. 74.63 లక్షలు ఖర్చు చేశారు

తెలుగుదేశంకు చెందిన ప్రకాష్ గౌడ్ (రాజేంద్రనగర్), వివేకానంద (కుత్బుల్లాపూర్), సాయన్న (కంటోన్మెంట్), ఎంఐఎంకు చెందిన మహ్మద్‌బీన్ అబ్దుల్లా బలాలా (మలక్‌పేట), జాఫర్ హుస్సేన్ (నాంపల్లి), కౌసర్ మొయినుద్దీన్ (కార్వాన్) అసెంబ్లీలో ప్రభావం చూపలేకపోయినా ఎమ్మెల్యే అభివృద్ధి నిధులలో గణనీయంగా ఖర్చు చేస్తూ పనులు ప్రారంభించారని, ఆ మేరకు వారిని అభినందిస్తున్నామని సాంబిరెడ్డి అన్నారు.

**అభివృద్ధి కోసమే పార్టీ మారామని ప్రజల్ని బుకాయిస్తున్న జంప్ జిలానీల తీరు**

తలసాని శ్రీనివాస యాదవ్ (మంత్రి, సనత్‌నగర్): రూ. 64.35 లక్షలు ఖర్చు చేశారు

మాధవరం కృష్ణారావు (కూకట్‌పల్లి): రూ.75 లక్షలు ఖర్చు చేశారు

తీగల కృష్ణారెడ్డి (మహేశ్వరం): రూ.96 లక్షలు ఖర్చు చేశారు

ఇప్పటికైనా హైదరాబాద్ ఎమ్మెల్యేలు పనితీరును మెరుగుపరుచుకోవాలని, అసెంబ్లీలో ప్రజాసమస్యలపై గళమెత్తాలని, తమకు కేటాయించిన అభివృద్ధి నిధులను ఖర్చు చేయటంతోపాటు అదనపు నిధుల్ని సాధించి అవినీతి లేకుండా ప్రజల భాగస్వామ్యంతో ఖర్చు పెట్టాలని బొంతు సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. లోక్‌సత్తా నేతలు గంగాభవానీ, రామచందర్, శ్రావణ్, ప్రసాద్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ❀

# మాంసంపై నిషేధం ప్రజల స్వేచ్ఛపై దాడి : జేపీ

జైనుల ఉపవాస దీక్షల పేరుతో ముంబయిలో మాంసంపై నిషేధం మతిమాలిన చర్య అని, ప్రజల స్వేచ్ఛపై దాడి అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రభుత్వాలు చేయాల్సినవి ఇలాంటి పనులు కాదన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి వేరే పనులేవీ లేవా? అని ప్రశ్నించారు. వైవిధ్యం కోసమన్నట్టు శివసేన ఈసారి సరైన రీతిలో స్పందించి ప్రభుత్వ తీరును తప్పుపట్టిందన్నారు.

జైనులు, ఇతర శాకాహారుల సున్నితమైన మత విశ్వాసాలను, భావాలను మనందరం గౌరవిస్తామని, అయితే ఒకరి ఆహారపు అలవాట్లను ఇంకొకరి మీద రుద్దే అధికారం మాత్రం ఎవరికీ లేదని జేపీ అన్నారు. ఇతరులకు హాని కలిగించనంత వరకూ నచ్చింది తినే, సేవించే, మాట్లాడే హక్కు మనకున్న స్వేచ్ఛలో భాగమని, మన జీవనశైలిని శాసించే హక్కు ప్రభుత్వానికి లేదని అన్నారు.

**దేశ ప్రయోజనాల కంటే తామే గొప్పనుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధిచెబుదాం**

'కన్నుకి కన్ను' తరహాలో బీజేపీ, కాంగ్రెస్ ఒకరిపై ఒకరు ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతుండటం వల్ల దేశ ఆర్థికవ్యవస్థ అంధకారంలోకి వెళ్తోందని జేపీ హెచ్చరించారు. కీలకమైన జీఎస్‌టీ బిల్లును గతంలో బీజేపీ అడ్డుకుంది కాబట్టి ఇప్పుడు తాము అడ్డుకుంటామని కాంగ్రెస్ చెప్పటం సహించరానిదన్నారు. భారతదేశం రాజకీయ పార్టీల సొంత అడ్డా కాదన్నారు. పార్టీలకన్నా దేశం మిన్న అన్నారు. కాంగ్రెస్‌కు ఆత్మహత్య చేసుకోవాలన్న కోరిక ఉన్నట్టుందని, దుర్మార్గపు ఆలోచనలతో అలా బరితెగించి వ్యవహరిస్తే ప్రజలే శిక్షిస్తారని అన్నారు. పార్టీల తీరు పార్టీలకే పరిమితమైతే మనకెందుకని వదిలేయొచ్చని, అయితే వాటి వల్ల దేశం భారీ మూల్యం చెల్లిస్తున్నందున స్పందించక తప్పదని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ వ్యవహారశైలి వల్ల విలువైన సమయం వృధా అవుతోందని, భారతదేశం వేగంగా ఎదిగే అవకాశాల్ని చేజార్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు.

మన సార్వభౌమత్వంపై రాజకీయ పార్టీల దురాక్రమణను అందరం ఖండించాలని, పార్టీలు మన కోసం ఉన్నాయి తప్ప పార్టీల కోసం మనం లేమని భారతీయులంతా ఏకకంఠంతో పార్టీలకు గుర్తుచేయాలని, "ఇది ప్రజలకు, పార్టీలకు మధ్య పోరాటం" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

**హైదరాబాద్**

# మన్సూరాబాద్, ఆనంద్‌నగర్ మార్గంలో రోడ్డు నిర్మాణపనులు చేపట్టాలి



రోడ్డు నిర్మాణపనులు చేపట్టాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో కాగడాలతో నిరసన తెలుపుతున్న నాయకులు, స్థానికులు

మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆనంద్‌నగర్ నుంచి మన్సూరాబాద్ మార్గంలో అస్తవ్యస్తంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో కాగడాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు దోసపాటి రాము మాట్లాడుతూ ఆనంద్‌నగర్ నుంచి మన్సూరాబాద్ మార్గంలో రోడ్డు అస్తవ్యస్తంగా మారి నాలుగు సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు పనులను చేపట్టకపోతే కాలనీలవాసులతో కలిసి మున్సిపల్ ఆఫీసును ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్. సతీష్‌కుమార్, శ్రీకాంత్‌గౌడ్, రమేష్ కోట్ల, రాజు, మల్లేష్‌యాదవ్‌తో పాటు త్యాగరాయనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

# భవిష్యత్‌లో బాబు, జగన్‌లను గద్దెనిక్కనివ్వం

## లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్రశ్రీవాస్తవ

ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్షపాత్రలో విఫలమైన జగన్‌మోహన్‌రెడ్డిలను భవిష్యత్‌లో రాష్ట్రంలో గద్దెనెక్కే అవకాశం లేకుండా చేస్తామని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్రశ్రీవాస్తవ అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ నాగేంద్రబాబుతో కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా ఇసుక అక్రమాలను, ల్యాండ్ మాఫియాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. నవంబర్ 7,8 తేదీలలో జిల్లాలో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు గుప్పించిన బీజేపీ




అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రజలను మోసపుచ్చుతోందని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్, విద్యార్థి సత్తా జిల్లా అధ్యక్షుడు అమర్‌యాదవ్, నాయకులు దేవేంద్ర, సరస్వతమ్మ, నరేష్, భాస్కర్ పాల్గొన్నారు.


# వృద్ధుల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి



ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో సిబ్బంది కొరత, జవాబుదారీతనం లేకపోవడంతో పెన్షన్ల అర్హత ఉండి కూడా చాలా మందికి పెన్షన్లు రావడం లేదని గ్రేటర్ హైదరాబాద్ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు దోసపాటి రాము ఆరోపించారు. లోక్‌సత్తా పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు సతీష్ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయం వద్ద పెన్షన్ల కోసం వచ్చిన మహిళల సమస్యలు తెలుసుకుని వారి పెన్షన్ పత్రాలను పూరించి అధికారులకు అందించారు ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి పెన్షన్ల కోసం వచ్చే వృద్ధులకు సమాచారం ఇవ్వడంతో పాటుగా ఫారాలు పూరించే విధంగా చూడాలని ఆయన సూచించారు. చాలా మంది వృద్ధులు అర్హులై ఉండి కూడా పెన్షన్లు రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా లోక్‌సత్తా కార్యదర్శి జెన్నెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్బీనగర్ అధ్యక్షుడు సతీష్‌కుమార్, అంజయ్య, వెంకటేష్, జగన్‌మోహన్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సత్తా కార్యాలయ ప్రారంభం

కేపీహెచ్‌బీకాలనీ మూడో ఫేజ్‌లోని రమ్య గ్రౌండ్స్ సమీపంలో లోక్‌సత్తా పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగారావు ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో జరుగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ సత్తాను చాటాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హైమప్రవీణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గారావు, కార్యనిర్వాహక కార్యదర్శి దేవీప్రసాద్ , గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బి. సాంబిరెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి గట్టుపల్లి లావణ్య పాల్గొన్నారు.


"లోక్‌పాల్ ను, అవినీతి పై పోరును నీరుగార్చే సెక్షన్ '17ఎ'
ప్రతిపాదనను అవినీతి నిరోధక చట్టం నుంచి
ఉపసంహరించేలా పార్లమెంట్ సభ్యులు
పార్టీలకతీతంగా పోరాడాలి"
- జయప్రకాష్ నారాయణ్
ఈ సందేశం ప్రతి ఒక్కరికి చేరేలా షేర్ చేయండి...
లోక్‌సత్తా పార్టీ

Posting Date 7-10-2015

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on October 1st, 2015



"రాజకీయాలలో ఎంటర్‌ప్రెన్యూర్ దృక్పథం"పై ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఇటీవల ఎఐఇఎస్ఇసి నిర్వహించిన హైదరాబాద్ యూత్ స్పీక్ ఫోరమ్‌లో ప్రసంగిస్తున్న డా॥ జయప్రకాష్ నారాయణ్

| Book-Post<br>PRINTED MATTER | To, |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad